




PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 5 సంచిక: 296, పేజీలు - 08

మంగళవారం, ఏప్రిల్ 14, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD










## 50 శాతం పెంపుతో

# డీలిమిటేషన్ దేశానికి ప్రమాదకరం

### - డీలిమిటేషన్ పై సీఎం రేవంత్ కొత్త ప్రతిపాదనలు

- ఏపీకి 38, తెలంగాణకు 30 ఎంపీ సీట్లు!
- నియోజకవర్గాల పునర్విభజనపై సీఎం రేవంత్ కొత్త ప్రతిపాదన
- జనాభా బదులు జీఎస్డీపీ ఆధారంగా ఎంపీ సీట్లు కేటాయించాలని సూచన
- ఆర్థికంగా రాణించే రాష్ట్రాలకు రాజకీయంగా మేలు చేయడమే లక్ష్యం

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజన అంశాలను కలిపి చూపిస్తూ కేంద్ర ప్రభుత్వం రాజకీయ వ్యూహాలు పన్నుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. సచివాలయంలో డీలిమిటేషన్ అంశంపై మాట్లాడారు. మహిళాబిల్లు, నియోజకవర్గాల పునర్విభజన రెండు అంశాలకు ఒకదానితో ఒకటి సంబంధం లేదని, ప్రతిపక్షాలు సహకరించడం లేదని ప్రచారం చేయడానికే కేంద్రం వీటిని ముడిపెడుతోందని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి మహిళల రాజకీయ సాధికారతకు కట్టుబడి ఉందని, గతంలోనే రాజీవ్ గాంధీ స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు తీసుకువచ్చారని గుర్తు చేశారు. సోనియా గాంధీ హయాంలో మహిళా బిల్లు రాజ్యసభలో ఆమోదం పొందినా, అప్పట్లో బీజేపీ సహకరించకపోవడం వల్లే లోక్‌సభలో ఆగిపోయిందని గుర్తు చేశారు. ప్రస్తుతం మహిళా రిజర్వేషన్ల అమలును 2026 జనాభా లెక్కల తర్వాతే చేపడతామని చెప్పడం మహిళలను వంచించడమేనని రేవంత్ రెడ్డి ఆరోపించారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లోనే

2లో..



## మహిళా రిజర్వేషన్ల అమలు

# చారిత్రక ఘట్టం

### - 2029 ఎన్నికల నుంచే వర్తింపు అన్న ప్రధాని మోదీ



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని అసలైన స్ఫూర్తితో అమలు చేసే సమయం ఆసన్నమైందని భారత ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఇందుకోసం పార్లమెంట్ మూడు రోజులపాటు ప్రత్యేకంగా సమావేశం అవుతుందని, అన్ని పార్టీలు రాజకీయాలకు అతీతంగా మద్దతు ఇవ్వాలని కోరారు. ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో సోమవారం జరిగిన నారీశక్తి వందన్ సమ్మేళన్ కార్యక్రమంలో పలు రంగాల ప్రముఖులను ఉద్దేశించి ప్రధాని మోదీ ప్రసంగించారు. మహిళలకు సముచిత స్థానం కల్పించేందుకు, నారీ శక్తిని

2లో..

# టీజీ టెట్-2026 షెడ్యూల్ విడుదల

### - ఏప్రిల్ 15 నుంచి దరఖాస్తులు ప్రారంభం

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్రంలో ఉపాధ్యాయ వృత్తిని ఎంచుకోవాలనుకునే నిరుద్యోగ అభ్యర్థులకు విద్యాశాఖ తీపి కబురు అందించింది. రాష్ట్రంలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష ( టెట్ ) - 2026 నిర్వహణకు ప్రభుత్వం అధికారికంగా నోటిఫికేషన్ జారీ చేసింది.

2లో..



# కేసీఆర్‌కు సీతక్క లీగల్ నోటీసులు

- అంగన్‌వాడీ కార్యకర్తలకు ఫోన్ల పంపిణీలో అవినీతి జరిగిందన్న బీఆర్ఎస్
- సీతక్క కమిషన్లు తీసుకున్నారంటూ సోషల్ మీడియాలో పోస్టులు
- 48 గంటల్లో పోస్టులు తొలగించాలంటూ కేసీఆర్‌కు సీతక్క నోటీసులు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు మంత్రి సీతక్క లీగల్ నోటీసులు పంపించారు. అంగన్‌వాడీ మొబైల్ ఫోన్ల కొనుగోలులో అవినీతి జరిగిందంటూ బీఆర్ఎస్ సోషల్ మీడియా వేదికగా చేస్తున్న ఆరోపణలను ఆమె తీవ్రంగా ఖండించారు. తన ప్రతిష్టకు భంగం కలిగించేలా ఉన్న ఆ పోస్టులను 48 గంటల్లోగా తొలగించి, కేసీఆర్ బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో సివిల్, క్రిమినల్ చర్యలు తప్పవని మంత్రి తన లీగల్ నోటీసులో స్పష్టం చేశారు. అసలు ఈ వివాదానికి కారణం బీఆర్ఎస్ నేత మన్నె క్రిషాంక్ చేసిన ఆరోపణలు. అంగన్‌వాడీలకు ఫోన్ల పంపిణీలో దాదాపు రూ. 30 కోట్ల మేర కుంభకోణం జరిగిందని క్రిషాంక్ ఆరోపించారు. బహిరంగ మార్కెట్లో రూ. 7 వేలకు లభించే ఫోన్లను, ప్రభుత్వం రూ. 14 వేలకు పైగా వెచ్చించి కొనుగోలు చేసిందని, ఇది మంత్రి సీతక్క కనుసన్నల్లోనే జరిగిందని ఆయన విమర్శించారు. ఈ మేరకు కొన్ని ఫోటోలు, ధరల వివరాలను సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ ప్రభుత్వంపై విమర్శల

2లో..

## పోరాడి సాధించిన విజయాలు చిరస్థాయిలో నిలిచిపోతాయి

### - అమరావతి రైతులకు రాష్ట్రపతి ప్రశంసలు



న్యూఢిల్లీ / అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నందుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్, ఎన్డీఏ ఎంపీలు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ఆమెను కలిసిన లోకేష్, ఐదు కోట్ల ఆంధ్రుల ఆకాంక్ష అయిన అమరావతికి రాజముద్ర వేసి శాశ్వతత్వం కల్పించినందుకు రాష్ట్ర ప్రజల తరఫున ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా

2లో..

# బ్రిటీష్ కాలం నాటి చట్టాలకు స్వస్తి

### - సంచలన సంస్కరణలు, చంద్రబాబు కీలక ఆదేశాలు

**అమరావతి (ప్రశ్న న్యూస్)** రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పాటు విషయంలో ఎలాంటి జాప్యం జరగ్గకుండా ఇప్పటికే అమలు చేస్తున్న విధానాలను మరింత సరళతరం చేసే దిశగా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. అనవసరపు చట్టాలను, నిబంధనలను తొలగించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న డి-రెగ్యులేషన్ ఫేజ్-2 కార్యక్రమంపై ముఖ్యమంత్రితో చర్చించేందుకు స్టీల్ సెక్రటరీ సందీప్ పౌండ్రిక్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం సోమవారం రాష్ట్ర సచివాలయానికి వచ్చింది. ఈ బృందంతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. ఈ సమీక్షలో సీఎస్ సాయి ప్రసాద్ సహా వివిధ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.పరిశ్రమల ఏర్పాటులో వేగం పెంచడం, అనుమతుల సులభతరం చేయడం అనవసరపు నిబంధనల సడలింపుపై చర్చించారు. కేంద్రం రూపొందించిన ప్రతిపాదనలను సీఎం చంద్రబాబుకు స్టీల్ సెక్రటరీ సందీప్ పౌండ్రిక్ వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పరిశ్రమలకు అనుమతుల్లో జాప్యం తగ్గించడానికి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలను రూపొందించుకున్న ప్రణాళికలను ఆయా శాఖల ఉన్నతాధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. రాష్ట్రంలో ప్రవేశపెట్టిన సంస్కరణలు, కేంద్రం సూచించిన మార్పులు, భవిష్యత్ కార్యాచరణపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చ జరిగింది. ఫేజ్-1 ఎంత వరకు అమలు చేశారని ఫేజ్-2లో ప్రస్తుత స్థితి గురించి ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. డి-రెగ్యులేషన్ ఫేజ్-1లో మొత్తం 7 శాఖల్లో 23 ప్రాధాన్యత అంశాలను పూర్తి చేశామని, ఇక ఫేజ్-2లో 28 ప్రాధాన్య అంశాలు నిర్దేశించుకున్నట్టు

2లో..



# రేవంత్ రెడ్డి ప్రతిపాదనలు రాజ్యాంగ విరుద్ధం

### - రాజ్యాంగ పునాదులను కాంగ్రెస్ బలహీనపరుస్తుందని విమర్శ

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) అంశంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ఖండించారు. ఆదాయం ప్రాతిపదికన సీట్ల విభజన జరగాలన్న రేవంత్ రెడ్డి వాదనను రాజ్యాంగ విరుద్ధమని కొట్టిపారేశారు. “అత్యధిక ఆదాయం ఇచ్చే ప్రాంతాలకే ఎక్కువ సీట్లు ఇవ్వాలన్నది రేవంత్ రెడ్డి వాదన. అదే నిజమైతే హైదరాబాద్‌కే అన్ని సీట్లూ ఇవ్వాలా? వెనుకబడిన పాలమూరు, ఆదిలాబాద్ వంటి జిల్లాల పరిస్థితి ఏమిటి?” అని సంజయ్ ప్రశ్నించారు. కాంగ్రెస్ హైకమాండ్‌కు నిధులు పంపి, ఇప్పుడు డబ్బు చుట్టూనే సిద్ధాంతాలు అల్లుతున్నారా? అని ఎద్దేవా చేశారు.బాబాసాహెబ్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగ పునాదులను కాంగ్రెస్ బలహీనపరుస్తోందని విమర్శించారు. అంబేద్కర్ జయంతికి ముందే ఆయన ఆశయాలను కించపరిచేలా ముఖ్యమంత్రి మాట్లాడటం బాధాకరమని, అంబేద్కర్ బతికుంటే కాంగ్రెస్‌ను దేశం నుంచి బహిష్కరించేవారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ మహిళా రిజర్వేషన్లకు వ్యతిరేకమని విమర్శించారు.

2లో..



# మహిళా రిజర్వేషన్ పేరుతో డీలిమిటేషన్ తేవొద్దు

### - ప్రధాని మోదీని ఉద్దేశిస్తూ సీఎం రేవంత్ రెడ్డి ట్వీట్



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** మహిళా రిజర్వేషన్ల అమలును డీలిమిటేషన్‌తో ముడిపెట్టడం సరికాదని పేర్కొంటూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రధాని నరేంద్ర మోదీకి సమగ్రమైన లేఖ రాశారు. మహిళా కోటాకు దేశవ్యాప్తంగా మద్దతు ఉందని, దీనిని రాష్ట్రాల వారీగా అసెంబ్లీ స్థానాల్లో తక్షణమే అమలు చేయాలని ఆయన కోరారు. అయితే, దీనిని సాకుగా చూపి జనాభా ప్రాతిపదికన లోక్‌సభ స్థానాల పునర్విభజన చేయడం వల్ల దక్షిణాది , చిన్న రాష్ట్రాలు రాజకీయంగా తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. జనాభా నియంత్రణ పాటించి అభివృద్ధి పథంలో నడుస్తున్న దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గడం వల్ల దేశ సమాఖ్య స్ఫూర్తి దెబ్బతింటుందని ముఖ్యమంత్రి హెచ్చరించారు. కేవలం జనాభా నిష్పత్తిని మాత్రమే ప్రామాణికంగా తీసుకోకుండా, అందరికీ ఆమోదయోగ్యమైన ప్రత్యామ్నాయ నమూనాలను పరిశీలించాలని ఆయన సూచించారు. దేశ ప్రయోజనాలు పార్టీ ప్రయోజనాల కంటే మిన్న అని, ఏకపక్ష నిర్ణయాలు కాకుండా జాతీయ స్థాయిలో ఏకాభిప్రాయం సాధించాలని కోరారు. ముఖ్యంగా ఉత్తరాది

2లో..

## తెలంగాణలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో హెల్త్ ఏటీఎంలు

### - నిమిషాల్లో 130 రకాల పరీక్షలు




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య పరీక్షల కోసం గంటల తరబడి నిరీక్షించే అవస్థలకు, రిపోర్టుల కోసం రోజుల తరబడి ఎదురుచూసే ఇబ్బందులకు ముగింపు పలికేందుకు తెలంగాణ సర్కార్ సిద్ధమైంది. వైద్యారోగ్య శాఖను బలోపేతం చేయడంలో భాగంగా పేద రోగులకు వేగవంతమైన, నాణ్యమైన

2లో..

# ఆర్టీసీలో మోగిన సమ్మె సైరన్

### - ఈనెల 22 నుంచి బస్సులు బంద్ - ప్రభుత్వానికి 32 డిమాండ్లు

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తమ డిమాండ్లను పరిష్కరించాలంటూ తెలంగాణ ఆర్టీసీ కార్మికులు సమ్మె సైరన్ మోగించారు. ఈ నెల 22వ తేదీ నుంచి సమ్మెకు దిగనున్నట్లు తాజాగా ఆర్టీసీ జేఏసీ ప్రకటన విడుదల చేసింది. గత నెల 13వ తేదీన సమ్మె నోటీసులు ఇచ్చినా రాష్ట్ర ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యం నుంచి ఎలాంటి

2లో..



# ఎస్ఐఆర్‌పై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

### - బెంగాల్ ఓటర్లకు దక్కని ఊరట



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) పశ్చిమ్ బెంగాల్‌లో ఎన్నికలకు ముందు హడావుడిగా చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై వివాదం నెలకుంది. దీనిపై కేంద్ర ఎన్నికల కమిషన్, బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీల మధ్య ఓ యుద్ధమే జరుగుంది. తాజాగా, ఈ అంశంపై మరోసారి సర్వోన్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. జాబితాలో కొనసాగే హక్కు ఓటర్‌కు ఉంటుందని, ఎన్నికలు నిర్వహించాలనే ఒత్తిడితో ప్రక్రియను వక్రీకరించకూడదని సూచించింది. అదే సమయంలో ఎస్ఐఆర్ కారణంగా తొలగింపునకు గురైన ఓటర్లు దాఖలు చేసిన పిటిషన్లను విచారించేందుకు సుప్రీం కోర్టు నిరాకరించింది. ఇప్పటికే ట్రైబ్యునళ్లలో వారి పిటిషన్లు విచారణలో ఉన్నాయని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్

2లో..

ప్రజాప్రశ్న

హైదరాబాద్ మంగళవారం 14, ఏప్రిల్ 2026

## 50 శాతం పెంపుతో డీలిమిటేషన్ దేశానికి ప్రమాదకరం

ఈ రిజర్వేషన్లు అమలు చేసి ఉంటే 181 మంది మహిళలు ఎంపీలుగా ఎన్నికయ్యే అవకాశం ఉండేదన్నారు. జనాభా లెక్కలతో సంబంధం లేకుండా, ప్రస్తుతం ఉన్న స్థానాల్లోనే వెంటనే మహిళా కోటాను అమలు చేయాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గాల పునర్విభజన అంశాన్ని ప్రధాని మోదీ దక్షిణాది రాష్ట్రాలపై ఒక రాజకీయ పావుగా వాడుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.జనాభా ప్రాతిపదికన మాత్రమే సీట్ల పునర్విభజన జరిగితే దక్షిణాది రాష్ట్రాలకు తీరని అన్యాయం జరుగుతుందని రేవంత్ రెడ్డి హెచ్చరించారు. కుటుంబ నియంత్రణను పకడ్బందీగా అమలు చేసి జనాభాను నియంత్రించినందుకు దక్షిణాది రాష్ట్రాలను శిక్షించడం సరికాదన్నారు. గతంలో ఇందిరా గాంధీ ఈ వివక్షను గమనించే సీట్ల పెంపుపై నిషేధం విధించారని గుర్తు చేశారు. ఇప్పుడు కేవలం జనాభా ప్రాతిపదికన సీట్లు పెంచితే ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల మధ్య రాజకీయ అంతరం విపరీతంగా పెరుగుతుందని, ఇది దేశ సమగ్రతకు మంచిది కాదని అభిప్రాయపడ్డారు.బీజేపీ హయాంలో దక్షిణాది రాష్ట్రాలకు కేంద్రంలో కీలక పదవులు దక్కడం లేదని, పునర్విభజన జరిగితే చిన్న రాష్ట్రాలు తమ రాజకీయ మనుగడను కోల్పోతాయని ముఖ్యమంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. వివక్ష పెరగడం వల్లే ప్రాంతీయ ఉద్యమాలు వస్తాయని, బీజేపీ మళ్లీ అదే తప్పు చేస్తోందని విమర్శించారు. దక్షిణాది రాష్ట్రాలు దేశానికి ఆర్థిక రాజధానులుగా ఉండి అత్యధికంగా పన్నులు చెల్లిస్తున్నాయని, రాజకీయంగా వాటి ప్రాధాన్యతను తగ్గించే ప్రయత్నాలను సహించబోమని స్పష్టం చేశారు.ఈ సమస్య పరిష్కారానికి రేవంత్ రెడ్డి ఒక 'హైబ్రిడ్ మోడల్'ను ప్రతిపాదించారు. పెంచాలనుకుంటున్న సీట్లలో 50 శాతం జనాభా ప్రాతిపదికన, మిగిలిన 50 శాతం ఆయా రాష్ట్రాల జీఎస్‌డీపీ భాగస్వామ్యం ఆధారంగా కేటాయించాలని సూచించారు. ఈశాన్య రాష్ట్రాలకు జనాభా తక్కువగా ఉన్నా ప్రాతినిధ్యం కల్పించినప్పుడు, అభివృద్ధిలో ముందున్న రాష్ట్రాలకు అదే గౌరవం ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు. ఇది కేవలం రాజకీయ పార్టీలకు సంబంధించింది కాదని, ప్రజల భవిష్యత్తుకు సంబంధించిన అంశమని పేర్కొన్నారు. హడావుడిగా నిర్ణయాలు తీసుకోకుండా ఈ అంశంపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని, నిపుణులతో కమిటీ వేసి అన్ని రాష్ట్రాల అసెంబ్లీల్లో చర్చించాలని రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. 2028 మార్చి వరకు ఈ ప్రక్రియను పూర్తి చేసే అవకాశం ఉన్నందున, ప్రజాస్వామ్యబద్ధంగా సంప్రదింపులు జరపాలని కోరారు. ఉత్తరాది, దక్షిణాది మధ్య గ్యాప్ పెంచేలా కేంద్రం వ్యవహరించవద్దని హితవు పలికారు.

## మహిళా రిజర్వేషన్ల అమలు చారిత్రక ఘట్టం

చాటిచెప్పేందుకు చారిత్రక మార్పు కోసం అందరూ చేతులు కలపాల్సిన అవసరం ఉందన్నారు. 2029లో జరగబోయే లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభ ఎన్నికలను కచ్చితంగా 33 శాతం మహిళా రిజర్వేషన్లతోనే నిర్వహించుకుంటామని ప్రధాని మోదీ అన్నారు. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు రాజకీయ పార్టీలన్నీ ఏకతాటిపైకి రావాలని, మహిళా రిజర్వేషన్ల చట్టంతో ముడిపడి ఉన్న సవరణ బిల్లులను ఏకాభిప్రాయంతో ఆమోదించాలని కోరారు. ఈ మేరకు వివిధ రాజకీయ పార్టీలకు చెందిన లోక్‌సభ, రాజ్యసభ పక్ష నాయకులకు లేఖలు రాసినట్లు తెలిపారు.

### 3 రోజులపాటు పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు

మహిళా రిజర్వేషన్ల చట్టంపై సమగ్రంగా చర్చించేందుకు తమ ప్రభుత్వం ఏప్రిల్ 16వ తేదీ నుండి మూడు రోజుల పాటు పార్లమెంటు ప్రత్యేక సమావేశాలను నిర్వహించనుందని మోదీ తెలిపారు. నేటి కార్యక్రమంలో ప్రసంగించిన ప్రధాని మోదీ ఎంపీలకు రాసిన లేఖలో పేర్కొన్న కొన్ని కీలక అంశాలను ప్రస్తావించారు. 2029 నుండి ఈ చట్టం అమల్లోకి వస్తే దేశంలోని ప్రజాస్వామిక సంస్థలకు సరికొత్త బలం చేకూరుతుందని పేర్కొన్నారు. చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలనే అంశం దశాబ్దాలుగా కేవలం చర్చలకే పరిమితం కాగా, తమ ప్రభుత్వం 2023లోనే దీనిపై చట్టం చేసిందని నరేంద్ర మోదీ గుర్తు చేశారు.

### ఆసక్తికర విషయాన్ని షేర్ చేసుకున్న ప్రధాని మోదీ

'నేను 2001లో కొత్తగా గుజరాత్ ముఖ్యమంత్రిని అయ్యాను. అప్పట్లో నాకు ప్రభుత్వం నడపడంలో అంతగా అనుభవం లేదు. 2002 లేదా 2003లో మా ఎమ్మెల్యే ఒకరు నా వద్దకు వచ్చి నియోజకవర్గంలోని ఒక గ్రామ పంచాయతీకి చెందిన మహిళలు మిమ్మల్ని కలవాలనుకుంటున్నారని చెప్పారు. ఆ పంచాయతీలోని సభ్యులందరూ మహిళలే అని చెప్పడంతో ఆశ్చర్యపోయా. వారు నన్ను కలవడానికి వచ్చినప్పుడు అది ఎలా సాధ్యమని, మీ లక్ష్యం ఏమిటి అని వారిని అడిగాను. రాబోయే 5 ఏళ్లలో ఏం చేయాలనుకుంటున్నారని అడిగాను. 8వ తరగతి వరకు చదువుకున్న ఆ మహిళా సర్పంచ్ ఇచ్చిన సమాధానం నన్ను ఆశ్చర్యపరిచింది. నేటికీ ఆమె సమాధానం నాకు గుర్తుంది. ఆమె ఏమన్నారంటే 'మా గ్రామంలో ఒక్క వ్యక్తి కూడా పేదవాడిగా మిగిలిపోకూడదు అని మేం కోరుకుంటున్నాము' అని ఆమె చెప్పారని' ప్రధాని మోదీ ఆసక్తికర విషయాన్ని ఈ సందర్భంగా షేర్ చేసుకున్నారు.దేశ జనాభాలో దాదాపు సగం ఉన్న మహిళలకు చట్టసభల్లో రాజకీయ భాగస్వామ్యాన్ని పెంచేందుకు కేంద్రం చర్యలు చేపట్టింది. మహిళా రిజర్వేషన్ చట్టాన్ని త్వరితగతిన అమల్లోకి తీసుకురావడంపైనే ఫోకస్ చేసినట్లు ప్రధాని మోదీ స్పష్టం చేశారు. మహిళల అభ్యున్నతి కోసం నిర్వహించే ఈ ప్రత్యేక పార్లమెంటు సెషన్‌లో ఎంపీలంతా రాజకీయాలకు అతీతంగా ముఖ్యమైన అంశానికి మద్దతు తెలిపి, ఈ చరిత్రాత్మక మార్పునకు నాంది పలకాలని కోరారు. ఈ నెల 16 నుంచి ప్రారంభమయ్యే పార్లమెంటు ఉభయ సభల ప్రత్యేక సమావేశాలకు తప్పనిసరిగా హాజరు కావాలని బీజేపీ తమ పార్టీ ఎంపీలకు విప్ సైతం జారీ చేసింది.

## టీజీ టెట్-2026 షెడ్యూల్ విడుదల

తాజా షెడ్యూల్ ప్రకారం ఏప్రిల్ 15 నుంచి నుంచి ఏప్రిల్ 30 వరకు అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించనున్నారు. ఈ ఏడాదిలో ఇది రెండో టెట్ నోటిఫికేషన్ కాగా వెయిటేజీ ఉండటంతో డీఎస్సీ కోసం సిద్ధమవుతున్న లక్షలాది మంది అభ్యర్థులకు ఇది ఒక అద్భుతమైన అవకాశమనే చెప్పాలి. టెట్ అప్లికేషన్లకు తక్కువ సమయే ఉన్నందున అభ్యర్థులు అప్లికేషన్ ప్రక్రియను త్వరగా పూర్తి చేసుకోవాలని అధికారులు సూచించారు. అప్లికేషన్ల స్వీకరణ అనంతరం జూన్ నెలలో టెట్ పరీక్షలను నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. పరీక్షా కేంద్రాల ఎంపిక, హాల్ టికెట్ల జారీ, ఇతర సాంకేతిక అంశాలపై ఇప్పటికే తెలంగాణ విద్యాశాఖ కసరత్తు ప్రారంభించింది. దీంతో అభ్యర్థులు సిలబస్‌ను సరిచూసుకుని జూన్‌లో జరిగే పరీక్షలకు సిద్ధం కావాలని విద్యా నిపుణులు నిరుద్యోగులకు సూచిస్తున్నారు. కాగా, టెట్ 2026కి అభ్యర్థులు తమ అప్లికేషన్లను ఆన్‌లైన్ ద్వారా మాత్రమే సమర్పించాల్సి ఉంటుంది. ఏప్రిల్ 15 నుంచి ఏప్రిల్ 30 వరకు అందుకు అవకాశం కల్పించారు. ఈ పరీక్షలకు ఒక్క పేపర్‌కు బీసీ/ ఓసీ అభ్యర్థులకు అయితే రూ.750 ఫీజుగా నిర్ణయించారు. ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ అభ్యర్థులకు అయితే రూ.700, రెండు పేపర్లకు అయితే బీసీ/ఓసీ అభ్యర్థులకు రూ.1000 ఫీజు, ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ అభ్యర్థులకు అయితే రూ.950 రూపాయలుగా ఫీజును నిర్ణయించారు.

### పరీక్షల షెడ్యూల్ ఇదే..

టెట్ ఎగ్జామ్‌ను జూన్ 15 నుంచి జూన్ 30 మధ్య నిర్వహించనున్నారు. పూర్తిగా కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) విధానంలో నిర్వహించనున్నారు. అప్లయ్ చేసుకున్న అభ్యర్థులు జూన్ 9 నుంచి తమ హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఇక ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధించాలంటే జనరల్/ ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు అయితే 60 శాతం, బీసీ అభ్యర్థులు అయితే 50 శాతం, ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ అభ్యర్థులు 40 శాతం అంతకంటే ఎక్కువ మార్కులు రావడం తప్పనిసరి అని వెల్లడించారు. టెట్ పరీక్షా ఫలితాలను జూలై 28 నుంచి 31 మధ్య విడుదల చేసేందుకు విద్యాశాఖ ప్రణాళికలను సిద్ధం చేసింది. నిరుద్యోగ అభ్యర్థులు పూర్తి వివరాల కోసం అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని విద్యాశాఖ అధికారులు కోరుతున్నారు.

## కలెక్టరేట్లో అధికారులపై
## కారం చల్లిన వృద్ధురాలు



**ఎన్టీఆర్ జిల్లా** నందిగామ మండలం అనాసాగరం గ్రామంకు చెందిన తులసి అనే వృద్ధురాలు ఈరోజు విజయవాడ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ సమావేశంలో ఆందోళనకు దిగింది. తన కుటుంబానికి చెందిన వ్యవసాయ భూమిని నేషనల్ హైవే విస్తరణలో తీసుకున్నప్పటికీ ఇప్పటివరకు సరైన పరిహారం చెల్లించలేదని ఆమె ఆరోపించింది.ఈ నేపథ్యంలో, పలుమార్లు అధికారులకు వినతి పత్రాలు ఇచ్చినా స్పందన లేకపోవడంతో తీవ్ర ఆగ్రహానికి గురైన తులసి, సమావేశం జరుగుతున్న సమయంలో అకస్మాత్తుగా అధికారులపై కారం చల్లి నిరసన వ్యక్తం చేసింది. ఈ ఘటనతో అక్కడ ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.సిబ్బంది వెంటనే స్పందించి వృద్ధురాలిని అదుపులోకి తీసుకుని బయటకు పంపించారు. ఈ ఘటనలో ఎవరికి పెద్దగా గాయాలు కాలేదని సమాచారం.వృద్ధురాలు మాట్లాడుతూ, "మూడేళ్లుగా తిరుగుతున్నా న్యాయం జరగడం లేదు. మా పొలం తీసుకుని డబ్బులు ఇవ్వలేదు" అంటూ ఆవేదన వ్యక్తం చేసింది.ఈ ఘటనపై అధికారులు స్పందిస్తూ, విషయం పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## బ్రిటీష్ కాలం నాటి చట్టాలకు స్వస్తి

అధికారులు చెప్పారు. మొత్తం 47 సిఫార్సుల్లో ఇప్పటివరకు 18 అమలు కాగా, మే 31 నాటికి పూర్తి లక్ష్యం చేరుకుంటామన్నారు.

### సులభంగా అనుమతుల ప్రక్రియ

పరిశ్రమలకు అనుమతుల ప్రక్రియలో ఉన్న క్లిష్టతను తగ్గించి, వేగం పెంచాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. బ్రిటీష్ కాలం నాటి చట్టాలు తొలగింపే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. ప్రస్తుతం 800కు పైగా ఉన్న నిబంధనలను 100లోపు తీసుకురావాలని, అనుమతులకు లైసెన్సులను సింగిల్ డిజిట్‌కు పరిమితం చేసే దిశగా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. అదే సమయంలో ప్రజల భద్రత, పర్యావరణ పరిరక్షణ వంటి కీలక అంశాల్లో రాజీ పడొద్దని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అనవసర వేధింపులు లేకుండా థర్డ్ పార్టీ తనిఖీలకు ప్రాధాన్యం ఇవ్వాలని, డబుల్ లైసెన్సింగ్ వంటి వాటిని పూర్తిగా తొలగించాలని సూచించారు. ఒకసారి రిజిస్ట్రేషన్ చేసుకున్న వ్యాపారాలకు జీవితకాల చెల్లుబాటు ఉండేలా వ్యవస్థను తీర్చిదిద్దాలన్నారు. ఇక ఫైర్ సేఫ్టీ అంశంలో నేషనల్ బిల్డింగ్ కోడ్ స్థానంలో రాష్ట్రానికి అనుకూలమైన, సరళమైన నిబంధనలు అమలు చేయాలని ఆదేశించారు. దరఖాస్తు నుంచి అనుమతి వరకూ మొత్తం ప్రక్రియను ఆన్‌లైన్ చేయాలని, ఫేజ్-2 అమలు అనంతరం పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన సమయం కనీసం 40 శాతం వరకు తగ్గేలా కార్యాచరణను రూపొందించాలని పేర్కొన్నారు.

### ఒకే శాఖలోని అన్ని అనుమతుల విలీనం

డి-రెగ్యులేషన్ ఫేజ్-2 అమలుకు అవసరమైన ఆర్డినెన్సులు తీసుకురావాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. పరిశ్రమలు, వ్యాపారాల కోసం ప్రస్తుతం 82 రకాల అనుమతులు తీసుకోవాల్సి ఉందని ఆ సంఖ్యను దశలవారీగా 57 వరకు తగ్గించాలని సీఎం సూచించారు. బిల్డింగ్ ప్లాన్ ఆమోదాలు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు వంటి కీలక అనుమతులు 30 వరకు ఉన్న ప్రక్రియలను 18కు తగ్గించేలా చూడాలన్నారు. ఒకే శాఖలో ఉన్న అనుమతులను విలీనం చేయడం, పర్మిషన్లు కాకుండా ప్రభుత్వానికి సమాచారం ఇచ్చే విధానం వంటి వాటిని అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.భూ వినియోగానికి సంబంధించిన క్లిష్టతను తగ్గించేందుకు భూ వినియోగ మార్పు అవసరాన్ని తొలగించడం, నాలా చట్టాన్ని రద్దు చేయడం వంటి నిర్ణయాలు ఇప్పటికే తీసుకోగా, భవిష్యత్తులో డిమాండ్ ఆధారిత జోనింగ్ విధానాన్ని అమలు చేసేలా లక్ష్యంగా పెట్టుకుని పని చేయాలని సీఎం స్పష్టం చేశారు. పరిశ్రమల పార్కులు, క్లస్టర్లలో భూమి వినియోగాన్ని మరింత సులభతరం చేసి, పెట్టుబడిదారులకు వేగంగా భూమి కేటాయించే విధానాన్ని బలోపేతం చేయాలని ఆదేశించారు. ఒకే నోడల్ ఏజెన్సీ ద్వారా అన్ని అనుమతులను ఇవ్వాలనే దిశగా ఆలోచన చేయాలని సీఎం సూచించారు. ఫైర్ సేఫ్టీ, పర్యావరణం, విద్యుత్, పర్యాటకం, విద్య, ఆరోగ్య రంగాల్లో కూడా అనుమతుల సరళీకరణకు ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు.

### అఫిడవిట్ ఆధారంగా వ్యాపారం ప్రారంభించే అవకాశం

నేషనల్ బిల్డింగ్ కోడ్ స్థానంలో రాష్ట్రానికి అనుకూలమైన సులభమైన ఫైర్ సేఫ్టీ నిబంధనలను తీసుకురావడం, పర్యావరణ అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయడం, విద్యుత్ కనెక్షన్లను త్వరితగతిన అందించడం వంటి చర్యలు అమలులోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి అన్నారు. ప్రత్యేకంగా ఎంఎస్ఎంఈ రంగంలో ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూడాలని ఆదేశించారు. అఫిడవిట్ ఆధారంగా వ్యాపారం ప్రారంభించే అవకాశం కల్పించడం, నిర్దిష్ట కాలానికి తనిఖీలు తగ్గించడం వంటి సంస్కరణలతో పెట్టుబడిదారులకు అనుకూల వాతావరణాన్ని సృష్టించే దిశగా పని చేయాలని సీఎం సూచించారు.ఇక అనుమతులకు సంబంధించిన పూర్తి ప్రక్రియను డిజిటలైజ్ చేయడం కూడా కీలక అంశమేనని సీఎం చెప్పారు. దరఖాస్తు నుంచి అనుమతి వరకూ అన్ని సేవలను ఆన్‌లైన్‌లోకి తీసుకువస్తే దరఖాస్తుదారులకు చాలా వరకు పని భారం తగ్గుతుందని అంతే కాకుండా ట్రాకింగ్, పారదర్శకతను పెంచినట్టు అవుతుందని సీఎం అధికారులకు వివరించారు. మీ సేవా, సింగిల్ డెస్క్ పోర్టల్, వాట్సాప్ గవర్నెన్స్ మన మిత్ర వంటి వ్యవస్థల ద్వారా ప్రజలకు, వ్యాపారులకు సులభంగా సేవలను అందుబాటులోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

### డి-రెగ్యులేషన్‌లో కేంద్రం కంటే మెరుగ్గా రాష్ట్రం

డి-రెగ్యులేషన్ విషయంలో కేంద్రం ప్రతిపాదించిన అంశాల కంటే మెరుగ్గా ఏపీ పని చేస్తోందని స్టీల్ సెక్రటరీ సందీప్ పౌండ్రిక్ సీఎం చంద్రబాబుతో అన్నారు. నిర్దిష్ట గడువులోగా ఏపీ ఫేజ్-2ను అమలు చేస్తుందన్న నమ్మకం తమకు ఉందని పౌండ్రిక్ అభిప్రాయపడ్డారు. నేషన్ ఫస్ట్ నినాదంతో తాము పని చేస్తున్నామని, ఇలాంటి సంస్కరణల ద్వారా భారత దేశ నిర్మాణం జరుగుతుందని సీఎం చంద్రబాబు చెప్పారు. తాము పారిశ్రామిక రంగంలో అభివృద్ధి సాధించేందుకు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానానికి మారామని సీఎం వెల్లడించారు. అటవీ చట్టాలను వీలైనంత సరళీకరించాలంటూ కేంద్ర బృందానికి ముఖ్యమంత్రి సూచించారు. డి-రెగ్యులేషన్ ఫేజ్-3ను అమలు చేస్తున్నారా.? అని ముఖ్యమంత్రి స్టీల్ సెక్రటరీని అడిగారు. జూన్ నెల నుంచి ఆ పని మీద ఉంటామని పౌండ్రిక్ తెలిపారు. ఫేజ్-3లో టెక్నాలజీ, ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టూల్స్ వినియోగానికి ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం సూచించారు. డేటా లేక్, రియల్ టైం డేటా, సీఎఫ్ఎంఎస్, అవేర్-2.0, వాట్సాప్ గవర్నెన్స్ వంటి వ్యవస్థలను ఇప్పటికే తాము వినియోగిస్తున్నామని పౌండ్రిక్‌కు సీఎం వివరించారు.

## ఆర్టీసీలో మోగిన సమ్మె సైరన్

స్పందన రాలేదని ఆర్టీసీ జేఏసీ వైస్ ఛైర్మన్ థామస్ రెడ్డి వెల్లడించారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి సమ్మె నివారణ చర్యలను చేపట్టాలని తెలిపారు. ప్రభుత్వం, యాజమాన్యం ముందు ఆర్టీసీ జేఏసీ 32 డిమాండ్లను ఉంచినట్లు స్పష్టం చేశారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంతోపాటు కార్మిక సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని పేర్కొన్నారు. అదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చినట్లుగా తమకు కూడా సమానంగా జీతభత్యాలు ఇవ్వాలని ఆర్టీసీ జేఏసీ డిమాండ్ చేస్తోంది.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు ఎన్నికల సమయంలో విడుదల చేసిన మేనిఫెస్టోలో ఇచ్చినట్లు తమ డిమాండ్లను నెరవేర్చాలని ఆర్టీసీ కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. సమ్మె నోటీసులు ఇచ్చి నెల రోజులు గడుస్తున్నా ఎలాంటి స్పందన రాలేదని తెలిపారు. ఈ నెల 9వ తేదీన హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్ రోడ్‌లో ఉన్న కార్మిక శాఖ కార్యాలయంలో లేబర్ డిపార్ట్‌మెంట్ అధికారులతో ఆర్టీసీ జేఏసీ నేతలు సమావేశమై చర్చించారు. ఇప్పటికైనా ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టి సానుకూలంగా స్పందించాలని కోరారు.ఆర్టీసీని రాష్ట్ర ప్రభుత్వంలో విలీనం చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరుతున్నట్లు ఆర్టీసీ జేఏసీ ఛైర్మన్ ఈదురి వెంకన్న డిమాండ్ చేశారు. ఆర్టీసీని విస్తరించడం మంచిదేనని అయితే ఆ పేరుతో సంస్థను నిర్వీర్యం చేయొద్దని కోరారు. ప్రైవేట్ ఎలక్ట్రిక్ బస్సులను తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోందని అయితే అలా చేయడం వల్ల గుత్తేదారుల చేతుల్లోకి వెళ్లిపోయే ప్రమాదం ఉందని అందువల్ల వాటిని ప్రభుత్వమే నిర్వహించాలని సూచించారు. తమవి న్యాయమైన డిమాండ్లు అని వాటిని వెంటనే పరిష్కరించాలనే ప్రభుత్వాన్ని ఆర్టీసీ జేఏసీ ఛైర్మన్ కోరారు. ఆర్టీసీ కార్మికులకు సంబంధించి ఏ ఒక్క సమస్య కూడా పరిష్కారం కాకపోవడం వల్లే కార్మికుల ఆవేదనను అర్థం చేసుకుని సమ్మె చేయాల్సి వస్తోందని వివరించారు. సమ్మె విరమణ చర్యలు విఫలమై సమ్మె చేయాల్సి వస్తే దానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని పేర్కొన్నారు. తమ డిమాండ్లను పరిష్కరించే వరకు తమ పోరాటం ఆగదని తేల్చి చెప్పారు.ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియను తక్షణమే చేపట్టాలని యూనియన్ నాయకులు ఇప్పటికే డిమాండ్ చేస్తున్నారు. 30 శాతం ఫిట్‌మెంట్‌తో 2021 వేతన సవరణను అమలు చేయాలని అదే సమయంలో ప్రతినెలా మహాలక్ష్మి పథకం కింద ఇచ్చే రూ.350 కోట్లలో ఎలాంటి కోతలు, కండిషన్లు లేకుండా రిలీజ్ చేయాలని ఆర్టీసీ కార్మికులు సమ్మె నోటీసులో పేర్కొన్నారు. అంతేకాకుండా వేతనాలు, బెనిఫిట్స్, సర్వీస్ వంటి సమస్యలపై ఆర్టీసీ కార్మికులు గత కొంతకాలంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే తమ డిమాండ్లను ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో మరింత ఒత్తిడి తెచ్చేందుకు ఈ సమ్మెకు రెడీ అయ్యారు.

## పాత వస్తువుల దుకాణంలో భారీ అగ్ని ప్రమాదం

**హన్మకొండ** హన్మకొండలోని చైతన్య డిగ్రీ కళాశాల సమీపంలో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. పాత ఇనుప సామాన్ ప్లాస్టిక్ స్టోరేజ్ భద్రపరిచే రూమ్ లో అగ్ని ప్రమాదం జరిగింది. భారీ ఎత్తున ఎగసిపడుతున్న మంటలను ఫైర్ సిబ్బంది అదుపులోకి తెచ్చారు. అప్పటికే షాపు, చుట్టుపక్కల ప్రాంతాలు కాలి బూడిద అయ్యాయి. ..

## తిరుచానూరు పోలీస్ స్టేషన్ వద్ద ఉద్రిక్తత

**తిరుపతి** తిరుచానూరు పోలీసు స్టేషన్ ముందు సోమవారం నాడు ఉద్రిక్తత నెలకొంది. పద్మావతి అమ్మవారు ఆలయం వాహన బేరర్లపై దాడి కేసులో 19 మందిపై కేసు నమోదు చేసారు. అయితే, తమ వారిపై అక్రమంగా పోలీసులు కేసులు నమోదు చేశారంటూ మహిళలు నిరసనకు దిగారు. పోలీసు స్టేషన్ ఎదుట రోడ్డుపై బైఠాయించిన వైనం. కేవలం రాజకీయ కక్షలతోనే తమవారిని వేధిస్తున్నారంటూ మండిపడ్డారు. ఎమ్మెల్యే డౌన్ డౌన్.. ఎస్పీ డౌన్ డౌను అంటూ నినాదాలు చేసారు. కక్షపూరితంగానే తమ వారిపై కేసులు నమోదు చేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేసారు. ఎమ్మెల్యే నాని ఆదేశాలతోనే అక్రమంగా అరెస్టులు అని ఆరోపించారు. ముందుగా దాడి చేసిన వారిపై ఎందుకు కేసు నమోదు చేయలేదంటూ పోలీసులను నిలదీసారు. ఫిర్యాదు చేసేందుకు వచ్చిన వారినే అరెస్టు చేయడం ఏమిటంటూ ప్రశ్నించారు. వాహనాల రాకపోకలకు అడ్డంగా బైఠాయించి, పోలీసుల తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేసారు .

### పోరాడి సాధించిన విజయాలు
## చిరస్థాయిలో నిలిచిపోతాయి

అమరావతి చరిత్ర, సంస్కృతి, మాస్టర్ ప్లాన్ వివరాలతో కూడిన ప్రత్యేక పుస్తకాన్ని ఆమెకు అందజేశారు. రాజధాని నిర్మాణం కోసం చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు కేవలం 58 రోజుల్లోనే 34 వేల ఎకరాల భూమిని త్యాగం చేసిన రైతుల గొప్పతనాన్ని లోకేష్ రాష్ట్రపతికి వివరించారు. గత ప్రభుత్వ హయాంలో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ, మొక్కవోని దీక్షతో శాంతియుతంగా పోరాడారని ఆయన గుర్తుచేశారు. ప్రధాని నరేంద్ర మోదీ శంకుస్థాపన చేసిన అమరావతి పనులు, ఎన్డీఏ ప్రభుత్వం మళ్ళీ అధికారంలోకి వచ్చిన తర్వాతే శరవేగంగా పునఃప్రారంభమయ్యాయని ఈ సందర్భంగా ప్రస్తావించారు. రైతుల త్యాగాలను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కొనియాడుతూ, రాష్ట్రంపై ప్రేమతో భూములిచ్చిన రైతుల కృషి అభినందనీయమని పేర్కొన్నారు. పోరాడి సాధించుకున్న విజయాలు ఎప్పటికీ చిరస్థాయిగా నిలిచిపోతాయని, తన హయాంలోనే అమరావతి చట్టం రూపొందడం సంతోషకరమని ఆమె ఆనందం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథంలో పయనించాలని, రాజధాని పనులు ఎటువంటి ఆటంకాలు లేకుండా కొనసాగాలని ఆమె ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఒక విజనరీ లీడర్ అని, ఆయన దూరదృష్టితో రాజధాని అమరావతి అద్భుతంగా అభివృద్ధి చెందుతుందని రాష్ట్రపతి విశ్వాసం వ్యక్తం చేశారు. విభజన తర్వాత తీవ్రంగా నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌కు ఈ చట్టం ఒక కొత్త భరోసాను ఇస్తుందని నేతలు అభిప్రాయపడ్డారు. అమరావతిని అజరామరం చేసిన ఈ ఘట్టం ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోతుందని మంత్రి లోకేష్ ప్రశంసించారు.

## కేసీఆర్‌కు సీతక్క లీగల్ నోటీసులు

దాడి చేశారు. మంత్రి సీతక్క ఈ ఆరోపణలను అసంబద్ధమైనవిగా కొట్టిపారేశారు. అసలు మొత్తం టెండర్ విలువే రూ. 44 కోట్లు అయితే, అందులో రూ. 30 కోట్ల అవినీతి ఎలా సాధ్యమని ఆమె ప్రశ్నించారు. ఈ కొనుగోలు ప్రక్రియ మొత్తం తెలంగాణ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్ ద్వారా పారదర్శకంగా జరిగిందని, టెండర్ ఇవాల్యుయేషన్ కమిటీ నిర్ణయాల ప్రకారమే కాంట్రాక్ట్ ఇచ్చారని వివరించారు. ఈ ప్రక్రియతో తనకేమీ సంబంధం లేదని, కేవలం తన వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేందుకే బీఆర్ఎస్ కుట్ర పూరితంగా వ్యవహరిస్తోందని నోటీసులో పేర్కొన్నారు. మంత్రి లీగల్ నోటీసు పంపిన తర్వాత బీఆర్ఎస్ నేత మన్నె క్రిషాంక్ తనదైన శైలిలో స్పందించారు. తాము పంపిన ఆధారాలు చూసి భయపడి లీగల్ నోటీసుల వెనక దాక్కుంటున్నారని ఎద్దేవా చేశారు. తాము చేసిన ఆరోపణలు వాస్తవమని, కోర్టులోనే అన్ని ఆధారాలు బయటపెడతామని ధీమా వ్యక్తం చేశారు. లీగల్ నోటీసులకు భయపడే ప్రసక్తే లేదని, ఈ కుంభకోణంపై పూర్తిస్థాయి విచారణ జరగాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం ఈ వ్యవహారం ముదిరి కోర్టు మెట్లెక్కేలా కనిపిస్తోంది. ఒకవేళ బీఆర్ఎస్ తన ఆరోపణలను నిరూపించలేకపోతే, ఆ పార్టీ అధినేత కేసీఆర్ సమాధానం చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. మరోవైపు, కోర్టు విచారణలో నిజంగానే లోపాలు జరిగాయని తేలితే సీతక్క రాజీనామా చేయాలనే డిమాండ్లు పెరిగే అవకాశం ఉంది. ఏదేమైనా, ఒక సీనియర్ మంత్రి నేరుగా విపక్ష అధినేతకే నోటీసులు పంపడం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

## రేవంత్ రెడ్డి ప్రతిపాదనలు రాజ్యాంగ విరుద్ధం

గత 50 ఏళ్లలో 33 శాతం రిజర్వేషన్లు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించిన ఆయన, గతంలో పార్లమెంట్‌లో బిల్లు కాపీలు చించివేసిన ఆర్జేడీ, సమాజ్‌వాదీ పార్టీలతో కాంగ్రెస్ పొత్తులు పెట్టుకోవడంపై నిలదీశారు. జనాభాతో సంబంధం లేకుండా ప్రతి రాష్ట్రంలో 50 శాతం సీట్లు పెంచాలని ప్రధాని మోదీ నిర్ణయించారని, ఇది అభివృద్ధిలో అందరినీ భాగస్వాములను చేయడమేనని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు కాంగ్రెస్ విభజన రాజకీయాలకు నిదర్శనమని, ఇప్పటికైనా రాజ్యాంగ విలువలపై గౌరవంతో మాట్లాడాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు.

## మహిళా రిజర్వేషన్ పేరుతో డీలిమిటేషన్ తేవొద్దు

రాష్ట్రాలకు భారీగా సీట్లు పెరిగి, దక్షిణాది రాష్ట్రాల ప్రాధాన్యత తగ్గితే అది దీర్ఘకాలంలో దేశ సమగ్రతకు ముప్పుగా మారుతుందని రేవంత్ రెడ్డి తన లేఖలో విశ్లేషించారు. లోక్‌సభలో ప్రస్తుతమున్న ప్రాంతీయ సమతుల్యతను కాపాడుతూనే మార్పులు చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ విషయంలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి, అన్ని రాష్ట్రాల ఆందోళనలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే ముందడుగు వేయాలని ప్రధానిని కోరారు. లోక్‌సభ స్థానాల సంఖ్యను 50 శాతం మేర పెంచాలనే ప్రతిపాదనలపై స్పందిస్తూ, ఇది ఉత్తర మరియు దక్షిణాది రాష్ట్రాల మధ్య సీట్ల అంతరాన్ని మరింత పెంచుతుందని రేవంత్ రెడ్డి గణాంకాలతో వివరించారు. ఈ వివక్ష వల్ల దక్షిణాది రాష్ట్రాలు జాతీయ రాజకీయాల్లో అట్టడుగున పడిపోయే అవకాశం ఉందని, దీనిని నివారించడానికి పారదర్శకమైన విధానాన్ని అనుసరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ లేఖపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పందించారు. లోక్ సభ నియోజకవర్గాల పునర్విభజన విషయంలో రేవంత్ రెడ్డికి అవగాహన లేదని విమర్శించారు. ఈ అంశంపై కాంగ్రెస్ పార్టీ జాతీయ స్థాయిలో ఉద్యమం చేయనుంది. ఈ ఉద్యమంలో రేవంత్ రెడ్డి కీలకంగా వ్యవహరించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## ఎస్ఐఆర్‌పై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

నేతృత్వంలోని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఎస్ఐఆర్ ప్రక్రియలో 90 లక్షలకుపైగా ఓటర్లను తొలగించిన సంగతి తెలిసిందే. ఏకపక్షంగా తమ పేర్లను తొలగించిన ఎన్నికల కమిషన్ తమ అభ్యర్థనలను పట్టించుకోవడం లేదని పిటిషనర్లు ఆరోపించారు. అయితే, ఇప్పటికే పిటిషనర్లు ట్రైబ్యునళ్లకు వెళ్లారని, ప్రస్తుత అభిప్రాయాలు అర్థరహితమని న్యాయస్థానం వ్యాఖ్యానించింది. ఎస్ఐఆర్‌లో తొలగింపునకు గురైన ఓటర్ల అభ్యర్థనల పరిశీలనకు కలకత్తా హైకోర్టు ఆదేశాలతో 19 ట్రైబ్యునళ్లు ఏర్పాటుచేశారు.

వీటి వద్ద ప్రస్తుతం 30 నుంచి 34 లక్షల వరకు అప్పీళ్లు ఉన్నాయని ఈసీ తరఫు లాయర్ కోర్టుకు వివరించారు.ఈ సందర్భంగా పిటిషనర్ల తరఫున లాయర్ మాట్లాడుతూ అప్పీళ్లను నిర్దిష్ట కాలపరిమితిలోగా పరిష్కరిస్తారా.? లేక గడువు పెంచుకుంటూ పోతారా? అని ప్రశ్నించారు. ఇరు వర్గాల వాదనలు విన్న ధర్మాసనం స్పందిస్తూ "మనం పుట్టిన దేశంలో ఓటుహక్కు అనేది కేవలం రాజ్యాంగపరమైందే కాదు అదొక భావోద్వేగపూరిత అంశం కూడా ప్రజాస్వామ్యంలో భాగమై ప్రభుత్వాన్ని ఎన్నుకోవడంలో కీలకమైంది ఇదే సమయంలో నిర్ణీత కాల వ్యవధి నిర్ణయించి, ట్రైబ్యునళ్లపై భారం మోపలేం. పెద్ద సంఖ్యలో ఓటర్లు తొలగింపునకు గురై దాని వల్ల ఎన్నికలు ప్రభావితమైతే తప్ప రద్దు చేయలేం. న్యాయపరమైన జోక్యం ఎన్నికలను ప్రోత్సహించేలా ఉండాలి" అని పేర్కొంది. "అది అస్సలు కుదరని పని. ఒకవేళ మనం దీనికి అనుమతిస్తే, సంబంధిత వ్యక్తుల ఓటు హక్కులను రద్దు చేయాల్సి వస్తుంది" అని ధర్మాసనం స్పష్టం చేసింది. పశ్చిమ్ బెంగాల్ అసెంబ్లీకి రెండు దశల్లో ఏప్రిల్ 23, 29 తేదీల్లో ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే.

## తెలంగాణలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో హెల్త్ ఏటీఎంలు

సేవలు అందించే లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా "హెల్త్ ఏటీఎం"లను అందుబాటులోకి తీసుకురానుంది. ఈ ఏటీఎంల ద్వారా కేవలం నిమిషాల వ్యవధిలోనే దాదాపు 130 రకాల వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహించనున్నారు. ఈ వినూత్న కార్యక్రమాన్ని ఇప్పటికే పైలట్ ప్రాజెక్టుగా హైదరాబాద్‌లోని కింగ్ కోఠి, మలక్‌పేట ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రారంభించారు. అక్కడ ఈ యంత్రాలు అద్భుతమైన ఫలితాలను ఇవ్వడంతో అధికారులు పూర్తి సంతృప్తి వ్యక్తం చేశారు. హెల్త్ ఏటీఎంల ద్వారా వచ్చిన పరీక్ష ఫలితాలను, టీ-డయాగ్నోస్టిక్స్, ప్రముఖ ప్రైవేట్ ల్యాబ్‌ల రిపోర్టులతో పోల్చి చూడగా, ఫలితాల్లో కచ్చితత్వం ఉండటంతో ఈ ప్రాజెక్టును రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

దీంతో పేద, సామాన్య ప్రజలకు వేల రూపాయలు ఖర్చయ్యే కీలక వైద్య పరీక్షలు ఇకపై సులభంగా, వేగంగా అందనున్నాయి.క్లౌడ్ ఆధారిత టెక్నాలజీతో పనిచేసే ఈ హెల్త్ ఏటీఎంల ద్వారా బీపీ, ఈసీజీ, శరీరంలోని కొవ్వు శాతం, ఆక్సిజన్ స్థాయిలు, ఉష్ణోగ్రత వంటి 65 రకాల ప్రాథమిక పరీక్షలను నిమిషాల్లో పూర్తి చేయవచ్చు. వీటితో పాటు రక్త నమూనాల ద్వారా గ్లూకోజ్, హిమోగ్లోబిన్, లిపిడ్ ప్రొఫైల్, కాలేయం, కిడ్నీ పనితీరు, థైరాయిడ్ వంటి కీలక పరీక్షలు కూడా నిర్వహిస్తారు. అంతేగాక గర్భిణుల కోసం ఫీటల్ డాప్లర్, చర్మ వ్యాధుల నిర్ధారణకు డెర్మాస్కోప్ వంటి ప్రత్యేక సదుపాయాలు కూడా ఇందులో ఉన్నాయి. ఈ వ్యవస్థను మరింత పారదర్శకంగా, రోగికి సౌకర్యవంతంగా మార్చేందుకు ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ (అభ)తో అనుసంధానించారు. దీనివల్ల రోగి చేయించుకున్న ప్రతి పరీక్ష రిపోర్ట్ డిజిటల్ రూపంలో వారి అభా కార్డులో భద్రంగా ఉంటుంది. పరీక్ష పూర్తయిన వెంటనే రిపోర్టులు నేరుగా రోగి మొబైల్ ఫోన్‌కు వాట్సాప్ లేదా ఎస్ఎంఎస్ ద్వారా చేరతాయి. సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన లేని గ్రామీణ ప్రజలకు సహాయపడేందుకు ప్రతి ఏటీఎం వద్ద ప్రత్యేక సిబ్బందిని నియమించనున్నారు.అయితే, ఒక రోగికి అన్ని పరీక్షలు పూర్తి చేయడానికి దాదాపు 45 నిమిషాల నుంచి గంట సమయం పడుతుండటం పైలట్ ప్రాజెక్టులో ఒక సవాలుగా నిలిచింది. ఈ సమస్యను అధిగమించడానికి, రద్దీ ఎక్కువగా ఉండే ప్రధాన ఆసుపత్రుల్లో రెండు లేదా మూడు హెల్త్ ఏటీఎం యూనిట్లను ఏర్పాటు చేయాలని అధికారులు ప్రతిపాదించారు. త్వరలోనే ఈ సదుపాయాన్ని రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులకు విస్తరించేందుకు వైద్యారోగ్య శాఖ ఏర్పాట్లు చేస్తోంది.

## అన్ని వర్గాల ప్రజల కృషితోనే

# రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యం

**- జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్,**

**- ట్రాఫిక్ నియమాలు పాటిద్దాం: రోడ్డు ప్రమాదాలు నివారిద్దాం:**

**- జిల్లా ఎస్పీ అశోక్ కుమార్**




రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రోడ్డు ప్రమాదాలను నియంత్రించడం, ప్రజల్లో ట్రాఫిక్ నియమాల పట్ల బాధ్యతాభావం పెంపొందించడం లక్ష్యంగా "ఒతీతీతిలవ ఒశ్రీతిలవ" కార్యక్రమాన్ని ఏప్రిల్ 13 నుండి 18 వరకు జిల్లావ్యాప్తంగా విస్తృతంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఈరోజు జగిత్యాల పట్టణంలోని ఓల్డ్ బస్ స్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్శ్రీ సత్య ప్రసాద్, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ? ప్రస్తుత కాలంలో ఇతర ప్రమాదాల కంటే రోడ్డు ప్రమాదాల వల్లనే ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రమాదాలను గణనీయంగా తగ్గించేందుకు గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు రోడ్డు భద్రతా వ్యవస్థలను బలోపేతం చేయడం, ప్రజల్లో డిఫెన్సివ్ డ్రైవింగ్ సంస్కృతిని పెంపొందించడం "ఒతీతీతిలవ ఒశ్రీతిలవ" కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలు అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వినియోగం, ట్రాఫిక్ నియమాలను పాటించకపోవడం వంటి అంశాలేనని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వాహనం నడిపి, తమతో పాటు ఇతరుల ప్రాణాలను కాపాడాలని పిలుపునిచ్చారు. చిన్న నిర్లక్ష్యాలే పెద్ద ప్రమాదాలకు దారితీస్తాయని, అలాంటి సంఘటనలు కుటుంబాలకు తీరని నష్టాన్ని కలిగిస్తాయని హెచ్చరించారు. జిల్లా కలెక్టర్ శ్రీ సత్య ప్రసాద్ గారు మాట్లాడుతూ? రోడ్డు ప్రమాదాల నివారణ కోసం పోలీస్ శాఖ చేపడుతున్న "ఒతీతీతిలవ ఒశ్రీతిలవ" కార్యక్రమం ప్రశంసనీయమని తెలిపారు. వాహనదారులు జాగ్రత్తగా, నియమ నిబంధనలు పాటిస్తూ ప్రయాణిస్తే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని అన్నారు. రోడ్డు భద్రత ఒక్క పోలీస్ శాఖ బాధ్యత కాకుండా ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని స్పష్టం చేశారు. "వేగం ప్రాణం తీస్తుంది" అనే విషయాన్ని గుర్తుంచుకుని అధిక వేగంతో ప్రయాణించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ముఖ్యంగా తల్లిదండ్రులు తమ పిల్లలకు హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మధుసూదన్, డీఎస్పీ రఘు చందర్, ఆర్టీఓ శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి శ్రీనివాస్, ఇన్స్పెక్టర్లు కరుణాకర్, ఎస్.ఐలు, మున్సిపల్ కౌన్సిలర్లు, సుమారు 300 మంది విద్యార్థులు మరియు ప్రజలు పాల్గొని రోడ్డు భద్రతపై అవగాహన పొందారు.

## ప్రజలు తమ వ్యక్తిగత భద్రత కోసం

# సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి

**- జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్, - నేరాల నియంత్రణ, కేసుల ఛేదనలో సీసీ కెమెరాల పాత్ర కీలకం: - జిల్లా ఎస్పీ అశోక్ కుమార్**



ఆధునిక యుగంలో నేరాల నియంత్రణ, కేసుల ఛేదన, ప్రజా భద్రత పరిరక్షణలో సీసీ కెమెరాల వినియోగం అత్యంత కీలకంగా మారిన నేపథ్యంలో, కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా జగిత్యాల పట్టణంలో ఏర్పాటు చేసిన 150 సీసీ కెమెరాలను ఈరోజు జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి శ్రీనివాస్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ? "ప్రజల రక్షణకు, నేరాల అరికట్టడానికి సీసీ కెమెరాలు అమూల్యమైన సాధనాలు. ప్రతి వీధి, ప్రతి మూలలో కెమెరాలు అమర్చడం వలన నేరం జరిగిన వెంటనే గుర్తించడం, నిందితులను పట్టుకోవడం చాలా వేగంగా జరుగుతోంది. సీసీ కెమెరాలు లేకపోతే కేసుల ఛేదనలో ఆలస్యం జరిగేది, కానీ ఇప్పుడు వాటి సహాయంతో విచారణ వేగవంతమైంది" అని తెలిపారు. దొంగతనాలు, చోరీలు, గొడవలు, రోడ్డు ప్రమాదాలు వంటి ఘటనల్లో నిందితుల కదలికలు సీసీ కెమెరాల్లో రికార్డ్ అవడంతో పోలీసులు తక్షణమే స్పందించి అరెస్టులు చేయగలిగిన అనేక ఉదాహరణలు ఉన్నాయని వివరించారు. జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ మాట్లాడుతూ? "సీసీ కెమెరాలు పోలీసుల మూడో నేత్రం లాంటివి. ఇవి నేరాలు జరగకుండా ముందుగానే హెచ్చరికగా పనిచేస్తాయి. కెమెరాలు ఉన్నాయన్న భయం నేరస్థుల్లో ఉంటుంది" అని తెలిపారు. ప్రజలు తమ ఇళ్లకు, వ్యాపార సంస్థలకు, అపార్ట్‌మెంట్లకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రత్యేకంగా ప్రధాన రహదారులు, క్రాస్ రోడ్లు, బిజీ సెంటర్లు, మార్కెట్ ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు తప్పనిసరి అవసరమని పేర్కొన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా వ్యక్తిగత భద్రతతో పాటు సమాజ భద్రత కూడా బలోపేతం అవుతుందని తెలిపారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన స్థానిక కళాశాలలు, పాఠశాల యాజమాన్యాలు, వ్యాపారవేత్తలు మరియు ఇతర సంస్థల ప్రతినిధులను జిల్లా ఎస్పీ గారు అభినందించారు. ప్రజల సహకారం లేకుండా ఇలాంటి కార్యక్రమాలు విజయవంతం కావడం కష్టమని, ఇదే స్ఫూర్తితో ఇతర ప్రాంతాల ప్రజలు కూడా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మధుసూదన్, డీఎస్పీ రఘు చందర్, మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి శ్రీనివాస్, ఇన్స్పెక్టర్లు కరుణాకర్, ఎస్.ఐలు, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా విస్తృత అవగాహన సదస్సులు

## - జిల్లా కలెక్టర్ అంకిత్



**భద్రాద్రి బ్యూరో** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహిస్తున్న రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా జిల్లా వ్యాప్తంగా రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ఈ కార్యక్రమాలలో భాగంగా సోమవారం విద్యానగర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామసభకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మార్చి 6 నుండి ప్రారంభమైన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో ప్రతి వారం వివిధ అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు, హెల్త్ క్యాంపులు నిర్వహించడంతో పాటు డీ-అడిక్షన్, కౌన్సిలింగ్ సేవలను కూడా అందుబాటులోకి తీసుకువచ్చామని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీలలో గ్రామసభలు నిర్వహిస్తూ ప్రజలను ప్రత్యక్షంగా భాగస్వాములుగా చేసుకుంటూ అవగాహన కల్పిస్తున్నామన్నారు . రోడ్డు ప్రమాదాల వల్ల ప్రతి రోజు అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తూ, రోడ్డు ప్రమాదాలు రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరిలో బాధ్యతాయుతమైన ప్రవర్తన అవసరమని అన్నారు. ఈ గ్రామసభల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చి ప్రమాదాలను తగ్గించడం ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రమాదాలకు కారణమయ్యే బ్లాక్ స్పాట్లను గుర్తించడం, రహదారుల వెంట ఉన్న పిచ్చి మొక్కలను తొలగించడం, ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవడం వంటి చర్యలు చేపడుతున్నామని చెప్పారు. అలాగే ప్రమాదాల సమయంలో అంబులెన్స్ సేవలు సమయానికి అందుబాటులో ఉన్నాయా, సమీప ఆసుపత్రులకు కనెక్టివిటీ ఎలా ఉందనే అంశాలను కూడా ఈ గ్రామసభల ద్వారా సమీక్షిస్తున్నామని వివరించారు. పాఠశాల విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించడం ద్వారా వారు తమ తల్లిదండ్రులకు హెల్మెట్, సీట్ బెల్ట్ ప్రాముఖ్యతను తెలియజేసేలా చేయాలని సూచించారు. ఇది ఏ ఒక్క శాఖకు సంబంధించిన విషయం కాదని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసినప్పుడే ప్రమాద రహిత జిల్లాను సాధించగలమని అన్నారు. కొన్ని జిల్లాలో అమలు చేస్తున్న "నో హెల్మెట్ ? నో ఎంట్రీ" వంటి వినూత్న చర్యలు మంచి ఫలితాలు ఇస్తున్నాయని, అలాంటి ఆలోచనలను మన జిల్లాలో కూడా అనుసరించాలని సూచించారు. అతివేగం, డ్రంక్ అండ్ డ్రైవ్, హెల్మెట్ ధరించకపోవడం, సీట్ బెల్ట్ వినియోగం లేకపోవడం వంటి కారణాల వల్లే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని , వీటిపై విస్తృతంగా అవగాహన కల్పించి ప్రమాదాలను నివారించాలని పిలుపునిచ్చారు.



అన్ని శాఖలు సమన్వయంతో ఈ రోడ్డు భద్రత వారోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం గ్రామస్థులతో కలిసి రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో విద్యానగర్ సర్పంచ్ భూక్య శాంతి శ్రీ, ఉపసర్పంచ్ వాసిరెడ్డి మురళి, తహసిల్దార్ నాగరాజు, పంచాయతీ ఈవో వెంకటేశ్వర్లు, రవాణా, పోలీస్ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మునిసిపల్ చైర్ పర్సన్‌గా మౌనికి

**ఖాకాపూర్** నిర్మల్ జిల్లా ఖానాపూర్ మున్సిపల్ చైర్పర్సన్గా బాధ్యతలు చేపట్టిన అంకం మౌనిక ప్రమాణస్వీకారోత్సవంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు పాల్గొన్నారురామచంద్రరావు మాట్లాడుతూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ కాంగ్రెస్ పార్టీ అవలంబించిన అప్రజాస్వామిక, కుటిల విధానాలను దీటుగా ఎదుర్కొని.. ఖానాపూర్ మున్సిపాలిటీలో భారతీయ జనతా పార్టీ సాధించిన ఈ విజయం మన కార్యకర్తల పట్టుదలకు నిదర్శనమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యేలు ఏలేటి మహేశ్వర్ రెడ్డి, పాయల్ శంకర్ తదితరులు పాల్గోన్నారు.

## చలివేంద్రం ప్రారంభించిన ఉమ్మడి కడప జిల్లా డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు





**బద్వేలు** బద్వేలు ఆర్టీసీ బస్టాండ్ ఆవరణంలో ఆదివారం రాత్రి వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు ఊరిబిండి మహేష్ రెడ్డి, పరిటాల వెంకట సుబ్బయ్య (ఆర్య వైశ్య కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్), దేవిరెడ్డి తులసి రెడ్డి ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేయబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉమ్మడి కడప జిల్లా డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఎంతో ఉపయోగకరమని, ప్రజలకు ఉపశమనం కలిగించే చర్యలను మరింతగా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ బద్వేలు నియోజకవర్గం నాయకులు డాక్టర్ రాజశేఖర్ రాంబాబు పాలకొలను రాజశేఖర్ రెడ్డి జహంగీర్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం కుంభకోణాల ప్రభుత్వం

**హైదరాబాద్** స్మార్ట్ ఫోన్ల కొనుగోలులో స్కామ్కు పాల్పడి 4జీ ఫోన్లు ఇస్తూ, 5జీ ఫోన్లు ఇస్తున్నామని చెప్పుకుంటున్న వారిని ఏ చెప్పుతో కొట్టాలో సీతక్క సమాధానం చెప్పాలని బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ అన్నారు. అంగన్వాడీ వర్కర్ల కోసం ఇచ్చే స్మార్ట్ ఫోన్ల కాంట్రాక్టు సీతక్కకు సంబంధమే లేదంటూనే, ఇప్పుడు చెప్పుతో కొడుతానని అనడం ఏంటని అయన ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కుంభకోణాల ప్రభుత్వం. అందుకే ఈ ప్రభుత్వం చేసే విచారణపై మాకు నమ్మకం లేదు. ఈ స్కామ్లో కేంద్ర ప్రభుత్వ నిధులు ఉన్నాయి కాబట్టి, మేము సీబీఐ విచారణను డిమాండ్ చేస్తున్నామని అన్నారు.

## హుస్నాబాద్ చెరువులను

## పరిశీలించిన మంత్రి పొన్నం



**హుస్నాబాద్** హుస్నాబాద్ పట్టణంలో కొత్త చెరువు , ఎల్లమ్మ చెరువు,పల్లె చెరువు అభివృద్ధి పనులను మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం నాడు పరిశీలించారు. పల్లె చెరువు కట్ట సుందరీకరణ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని సూచించారు. హుస్నాబాద్ పట్టణ డ్రైన్ వాటర్ కొత్త చెరువు లో కలవకుండా నేరుగా ప్రత్యేక ఫీడర్ కి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. మంత్రి మాట్లాడుతూ కొత్త చెరువు అభివృద్ధి పై పలు సూచనలు చేయడం జరిగింది. అనంతరం ఎల్లమ్మ చెరువు సుందరీకరణ అభివృద్ధి పనులు పరిశీలించాను. కట్ట సుందరీకరణ డెవలప్మెంట్ జరుగుతున్న పనులపై ఆరా తీసి పనుల్లో నాణ్యత ఉండాలని ఆదేశించానునని అన్నారు. చెరువులో నిర్మితమవుతున్న గ్లాస్ బ్రిడ్జి పనులు పరిశీలించి కట్టపై గ్రీనరీ లాన్, కట్టపైన ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని సూచించారు. గుట్టపైన ఉన్న గుట్టపై వ్యూ పాయింట్ ఏర్పాటు చేయాలని సూచించారు. హుస్నాబాద్ ఎల్లమ్మ ఆలయ పరిసరాల్లో భక్తుల సదుపాయాల కోసం నిర్మిస్తున్న నూతన షెడ్డులను పరిశీలించారు. ఆలయ పరిసరాల్లో నూతనంగా నిర్మితమవుతున్న పోచమ్మ ఆలయాన్ని పరిశీలించారు. హుస్నాబాద్ 8,9 వ వార్డు కి సంబంధించి శ్మశాన వాటిక కు స్థల పరిశీలన చేసి పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారుజ మంత్రి వెంట మున్సిపల్ చైర్మన్ దండి లక్ష్మీ, వైస్ చైర్మన్ చిత్తారి పద్మ,మున్సిపల్ కౌన్సిలర్లు, ఆర్డీవో ,మున్సిపల్ కమిషనర్ ,ఇతర ముఖ్య నేతలు, అధికారులున్నారు.

## న్యాయవాది సుబ్బారావుకు పోలీసుల అల్కహాల్ టెస్ట్

**హైదరాబాద్** సింగర్ మంగ్లీపై ఫిర్యాదు చేసిన న్యాయవాది పోలీస్ స్టేషన్కు తాగి వచ్చినట్లు పోలీసులు నిర్ధారించారు.

న్యాయవాది సుబ్బారావుకు ఆల్కహాల్ టెస్ట్ పంజాగుట్ట పోలీసులు నిర్వహించారు. టెస్టులో 27గా రీడింగ్ నమోదు అవ్వగా, మద్యం తాగి పోలీస్ స్టేషన్కు వచ్చినట్లు నిర్ధారించారు. రాత్రి తాగిన దానికి ఇప్పుడు టెస్ట్ చేయడం ఏంటని, కేసును పక్కదారి పట్టించేందుకే డైవర్షన్లు చేస్తున్నారని ఫిర్యాదుదారుడి ఆరోపణ.

## కుప్పంలో భారీగా రేషన్ బియ్యం స్వాధీనం

**కుప్పం** కుప్పం లో భారీగా రేషన్ బియ్యం పట్టుపడింది. గుడిపల్లి మండలంలోని గుత్తార్లపల్లి సమీపంలోని ఓ ఇంట్లో భారీగా రేషన్ బియ్యం అక్రమ నిల్వ ను అధికారులు గుర్తించారు. టెంపోతో పాటు, సుమారు 4 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. కుప్పం నుండి కర్ణాటక రాష్ట్రానికి అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్నారు. తమిళనాడు, ఆంధ్రాకు రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించాం. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని కుప్పం డిఎస్పీ పార్థసారథి హెచ్చరించారు.

## గంభీరావుపేట జీపీ లో 'అరైవ్ అలైవ్' ప్లెడ్జ్

# రోడ్డు భద్రతపై అవగాహన

**- గంభీరావుపేట ఎస్సై : అనిల్ కుమార్**



గంభీరావుపేట (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, గంభీరావుపేట గ్రామపంచాయతీలో రోడ్డు భద్రతపై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు స్థానిక ఎస్సై అనిల్ కుమార్ ఆధ్వర్యంలో "అరైవ్ అలైవ్" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామస్థులు రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు భద్రతా నియమాలను పాటిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా నిర్లక్ష్యం, అధిక వేగం, ట్రాఫిక్ నియమాల ఉల్లంఘన వల్ల జరుగుతున్నాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరిస్తే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని సూచించారు. గ్రామస్థులు, యువత, ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొని రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించుకున్నారు.

# అందరికీ ఆహార భద్రత : సీఎం చంద్రబాబు

**అందుబాటులోకి 62 గ్రామీణ అన్న క్యాంటీన్లు**

**269కి పెరగనున్న క్యాంటీన్ల సంఖ్య**

**ఇప్పటికే 207 క్యాంటీన్ల ద్వారా ప్రతీ రోజు 2.10 లక్షల మందికి భోజనం**

**ఈనెల 15న ధరణికోటలో అన్నక్యాంటీన్‌ను ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు**



అమరావతి (ప్రశ్న న్యూస్ )కార్మికులు, కూలీలు, గ్రామీణులు వివిధ పనుల నిమిత్తం పట్టణాలకు వచ్చే ఏ ఒక్కరూ ఆకలితో ఉండకూడదన్న సంకల్పంతో 207 అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేసిన ప్రజా ప్రభుత్వం తాజాగా మరికొన్ని అన్న క్యాంటీన్లు అందుబాటులోకి తీసుకొస్తోంది. రూ.5లకే పేదలకు కడుపునిండా నాణ్యమైన భోజనాన్ని ప్రభుత్వం అందిస్తోంది. ఈ సేవలను గ్రామీణ ప్రాంతాలకూ విస్తరిస్తామని చెప్పిన సర్కార్, ఆ హామీని ఆచరణలో పెడుతోంది. మొదటి విడతలో రాష్ట్ర వ్యాప్తంగా 204 అన్న క్యాంటీన్లను కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో ఏర్పాటు చేయగా 3 క్యాంటీన్లు గ్రామీణ ప్రాంతాల్లో ప్రస్తుతం ఉన్నాయి. ఇప్పుడు కొత్తగా 62 క్యాంటీన్లను గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. రెండవ విడత అన్నక్యాంటీన్లను ఈ నెల 15న ముఖ్యమంత్రి చంద్రబాబు పెదకూరపాడు నియోజకవర్గం, ధరణికోటలో ప్రారంభిస్తారు

**రూ.5లతో రుచిగా... శుచిగా ఆహారం**

గత ప్రభుత్వం కక్షగట్టి మూసివేసిన అన్నక్యాంటీన్లను కూటమి అధికారంలోకి వచ్చాక పున: ప్రారంభించింది. ఈనెల 15వ తేదీన ప్రారంభించబోయే 62 క్యాంటీన్లతో ఈ సంఖ్య 269 కు పెరుగనుంది. రుచి, శుచితో కూడిన ఆరోగ్యకరమైన ఆహారాన్ని పేదలకు ప్రభుత్వం అందిస్తోంది. క్యాంటీన్ల పున:ప్రారంభం నుంచి ఇప్పటి వరకూ రాష్ట్రవ్యాప్తంగా పేదలు 8.80 కోట్ల భోజనాలు చేశారు. ఒక్కో అన్న క్యాంటీన్‌లో సగటున రోజుకు 1,013 మంది చేసే భోజనాలకు రూ.26,250 ఖర్చు అవుతోంది. 207 అన్న క్యాంటీన్ల ద్వారా రోజుకు 2.10 లక్షల మంది భోజనాలు చేస్తున్నారు. ఇందుకు రోజుకు రూ.54 లక్షలకు పైగా వ్యయం అవుతుండగా సబ్సిడీ కోసం ప్రభుత్వం ఇప్పటి వరకూ రూ.243 కోట్లు వెచ్చించింది. కొత్తగా ఏర్పాటు చేసే గ్రామీణ అన్న కాంటీన్ల సబ్సీడీకి ఏడాదికి రూ.58 కోట్లు వ్యయం అవ్వనుంది.

**ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన వివరాలు**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బుధవారం పల్నాడు జిల్లా, పెదకూరపాడు నియోజకవర్గం, ధరణికోటలో పర్యటిస్తారు. మధ్యాహ్నం 12.40 గంటలకు ఉండవల్లి నుంచి బయలుదేరి ఒంటిగంటకు ధరణికోటకు చేరుకుంటారు. 01.30 గంటలకు అన్నాక్యాంటీన్ ప్రారంభోత్సవంలో పాల్గొంటారు. అనంతరం లబ్ధిదారులతో కలిసి భోజనం చేస్తారు. కార్యక్రమాన్ని ముగించుకుని 02.45 గంటలకు ఉండవల్లికి చేరుకుంటారు.

# రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపామన్న : ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి.



ఢిల్లీ (ప్రశ్న న్యూస్) భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో న్యూ ఢిల్లీలో సోమవారం రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, ఉమ్మడి రాష్ట్ర పార్లమెంట్ సభ్యులు భేటీ అయ్యామని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతి బిల్లుకు ఆమోదం తెలిపినందుకు భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు కృతజ్ఞతలు తెలిపామన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతి చారిత్రక, సాంస్కృతిక నేపథ్యాన్ని రాష్ట్రపతికి రాష్ట్ర మంత్రి నారా లోకేష్ వివరించారనీ. మంత్రి నారా లోకేష్ వెంట నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి తో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కూటమి ఎంపీలు ఉన్నారు.

# బీసీ మహిళలకు సబ్ కోటా లేని బిల్లు మాకు అక్కర్లేదు

**- బీసీ అధ్యక్షురాలు మణిమంజరి సాగర్**

**- అగ్రకులాలకు మరో వంద సంవత్సరాలు రాజ్యాధికారం కట్టబెట్టడానికే మహిళా బిల్లు తీసుకొస్తున్నారు**

**- బీసీ ప్రధానినే బీసీలకు అన్యాయం తలపెడుతుండు**

**- బీసీలకు ద్రోహం చేస్తున్న బిజెపిని రాజకీయంగా బొంద పెడతాం**

**- మహిళా బిల్లుపై జాతీయస్థాయిలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలి**

**- బీసీ మహిళల సబ్ కోట సాధనకై నెల 16న పార్లమెంటు ముట్టడిస్తాశీ**

**- బీసీ ధర్నాలో జాజుల, విహెచ్, మధుసూదన చారి, శ్రీనివాస్ గౌడ్ వెల్లడి**



**బీసీ మహిళా సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు బి మనిమంజరి సాగర్**

హైదరాబాద్( ప్రశ్న న్యూస్) బీసీ మహిళలకు ప్రాతినిధ్యం లేని మహిళా బిల్లును తాము ఎట్టిపరిస్థితుల్లో అంగీకరించబోమని, బీసీ మహిళలకు సబ్ కోటా కల్పించిన తర్వాతనే మహిళా బిల్లు పార్లమెంట్ లో ఆమోదించాలని బిసి జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్, బీసీ మహిళా సంఘం ప్రెసిడెంట్ మణిమంజరి సాగర్ ,మాజీ ఎంపీ వి హనుమంతరావు, మధుసూదనచారి, వి శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. హైదరాబాదులోని గన్ పార్క్ వద్ద ఉన్న అమరవీరుల స్థూపం వద్ద బీసీ మహిళ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు బి మని మంజరి సాగర్ ఆధ్వర్యంలో మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోట కల్పించాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. ధర్నాలో పాల్గొన్న బీసీ ఉద్యమకారులు బీసీలపై కేంద్ర ప్రభుత్వం వ్యతిరేక వైఖరి నిరసిస్తూ నల్ల రిబ్బన్ ను ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ దేశ ప్రధాని మొదటిసారి బీసీల ఐకాన్ మహాత్మ జ్యోతిబాపూలే కు దండ వేసి దండం పెట్టాడని, దండ వేసి దండం పెడితే కూలీ ఆశయాలు నెరవేరయని, పూలే వారసులైన బీసీలకు జనాభా దామాషా ప్రకారం విద్యా ఉద్యోగ రాజకీయ రంగాల్లో సమాన వాటా కల్పించినప్పుడే లక్ష్యం నెరవేరుతుందని ఇది, ప్రధాని గమనించాలని ఆయన కోరారు లేకుంటే తమిళనాడు లో బిసిల ప్రభుత్వాన్ని ఓడించడంలో భాగంగానే పూలేకు నివాళులు అర్పించి నట్టుగా బీసీ సమాజం భావిస్తుందని ఆయన తెలిపారు . దేశవ్యాప్తంగా ప్రస్తుతం జరుగుతున్న జనగణన పూర్తి కాకుండానే నియోజకవర్గాల పెంపు, మహిళా బిల్లు ఎందుకు ఆమోదిస్తున్నారని ఆయన ప్రశ్నించారు . ప్రస్తుతం 542 పార్లమెంట్ స్థానాలను 816 పార్లమెంట్ స్థానాలకు పెంచుతున్నారని అంటే ఇప్పుడు ఉన్నటువంటి పార్లమెంటు స్థానాల కంటే పార్లమెంటు స్థానాలను పెంచి 273 స్థానాలు మహిళలకు రిజర్వేషన్ కల్పిస్తున్నారని ఆయన అన్నారు, మహిళా బిల్లు బీసీ మహిళలకు సబ్ కోట లేకపోవడం వలన మహిళా బిల్లు పేరుతో అగ్రకులాలకు చెందిన మహిళలు చట్టసభలో వెళతారని, బీసీ మహిళలు రాజకీయా అనేచివేతకు గురవుతారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు, మహిళా బిల్లు వలన ఇంకో 100 సంవత్సరాలు బీసీలకు రాజ్యాధికారం దక్కకుండా చేయడానికి కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తుందని జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. కాంగ్రెస్ మాజీ ఎంపీ వి హనుమంతరావు మాట్లాడుతూ బీసీ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఉన్నప్పటికీ దేశవ్యాప్తంగా బీసీలకు అన్యాయం జరుగుతుందని, బీసీ కులగణన చేస్తామని చెప్పి ఇంటింటి సర్వేలో బీసీ కుటుంబాలను లెక్కించకుండా అన్యాయం చేస్తున్నాడని ఇప్పుడు మళ్లీ మహిళా బిల్లు పెట్టి బీసీ మహిళలకు రాజకీయ వాటా కల్పించకుండా బీసీలకు ద్రోహం చేస్తున్నాడని మోడీపై ఆయన తీవ్రంగా మండిపడ్డారు, బిజెపి ఇదే విధంగా బీసీ వ్యతిరేక వైఖరి అవలంబిస్తే రాజకీయంగా బీసీలు బిజెపిని బొంద పెట్టడం ఖాయమని విహెచ్ హెచ్చరించారు.

మాజీ స్పీకర్ మధుసూదనాచారి, మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ మహిళా బిల్లుపై కేంద్ర ప్రభుత్వం జాతీయ స్థాయిలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసుకొని ఏకాభిప్రాయం ద్వారా మహిళా బిల్లును ఆమోదించాలని మహిళా బిల్లుకు సంపూర్ణ సాధికారత రావాలంటే ఈ బిల్లులో బీసీ మహిళలకు ఉపకోట ఉండాల్సిందేనని వారు తెలిపారు.

బీసీ మహిళలకు సబ్ కోట కల్పించే ఉద్యమంలో బిఆర్ఎస్ పార్టీ సంపూర్ణ భాగస్వామ్యం ఉంటుందని వారు తెలిపారు, బీసీ జేఏసీ ఈనెల 16న ఇచ్చిన చలో పార్లమెంట్ ముట్టడికి టిఆర్ఎస్ పార్టీ సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నది వారు తెలిపారు

మాట్లాడుతూ దేశంలోని 40 కోట్ల మంది బీసీ మహిళల ఆకాంక్షను ప్రధాని నరేంద్ర మోడీ గౌరవించాలని, మహిళా బిల్లు లక్ష్యం నెరవేరాలంటే అణిచివేత కు అవమానాలకు, కుల వివక్షతకు గురైనటువంటి మహిళల చట్టసభలు అడుగుపెట్టాలంటే మహిళా బిల్లులో బీసీ మహిళకు సబ్ కోట కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు బీసీ మహిళల సబ్ కోట సాధన కోసం దేశవ్యాప్త ఉద్యమానికి శ్రీకారం ఆమె హెచ్చరించారు

**కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకురాలు ఇందిరా శోభన్**

మాట్లాడుతూ బిజెపి మొదటి నుండి బీసీ వ్యతిరేక వైఖరి అవలంబిస్తుందని, బీసీలకు అన్యాయం చేస్తూ వస్తున్న బిజెపి ఇప్పుడు మహిళా బిల్లు పేరుతో బీసీ మహిళలకు అన్యాయం చేస్తుందని , బీసీ మహిళలకు సబ్ కోటా కల్పించకపోతే దేశవ్యాప్త బందుకు పిలుపునిచ్చి బీసీల అగ్రహాన్ని నరేంద్ర మోడీ ప్రభుత్వానికి చూపెడతామని ఆమె హెచ్చరించారు. ఈ ఆందోళనలో బీసీ జేఏసీ వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణ, తారకేశ్వరి, కుందారం గణేష్ చారి, కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్ సంధ్యారాణి, తాటికొండ విక్రమ్ గౌడ్ సుజాత, శ్యామల, కనకాల శ్యామ్ కూర్మ,విజయలక్ష్మి, పిట్ల శ్రీధర్, శేఖర్ సగర, వీరస్వామి, రాజేశ్వరి, స్వర్ణ గౌడ్, గౌతమి, గొడుగు మహేష్ యాదవ్, మాధవి, లతా గౌడ్ వెంకటమ్మ, శివమ్మ, ప్రసన్న, మీనా, అంజమ్మ, నరసమ్మ, నరసింహ, కవుల జగన్నాథం, ఉదయ్ నేత, హరి తిలక్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

# కోనాయపల్లిలో మాజీ ఎంపీటీసీ సోయినేని నర్సయ్యకు నివాళులు

**- బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు : ఏనుగు మనోహర్ రెడ్డి**



వేములవాడ (ప్రశ్న న్యూస్) వేములవాడ మున్సిపల్ పరిధిలోని కోనాయపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ సోయినేని నర్సయ్య సోమవారం మరణించడంతో గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. ఆయన భౌతిక కాయానికి బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా గోస్కుల రవి, వెంకట రెడ్డి, మల్లేశం, శేఖర్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొని నర్సయ్య సేవలను స్మరించుకున్నారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. గ్రామాభివృద్ధికి నర్సయ్య చేసిన సేవలు చిరస్మరణీయమని పలువురు పేర్కొన్నారు.

## ఎల్లారెడ్డిపేట సబ్‌స్టేషన్లను తనిఖీ చేసిన

# టీజీఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి

**విద్యుత్ మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట**

**వ్యవసాయ కనెక్షన్ల మంజూరు వేగవంతం**



ఎల్లారెడ్డిపేట( ప్రశ్న న్యూస్) తెలంగాణ నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (టీజీఎన్పీడీసీఎల్) చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేటలోని 132/33 కెవి , 33/11 కెవి సబ్‌స్టేషన్లను సోమవారం స్వయంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ముందుగా ట్రాన్స్కో అధికారులతో మాట్లాడుతూ పవర్ ఫ్యాక్టర్ గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పవర్ ఫ్యాక్టర్9 వస్తుందని చెప్పగా, ఇంకా పవర్ ఫ్యాక్టర్ మెరుగుపరచుకోవాలని సూచించారు. ఓవర్ లోడ్ ఉన్న ఫీడర్ ఉన్న వాటిని బదలాయింపు చర్యలు చేపట్టాలని, అలాగే కెపాసిటర్ బ్యాంకులు పెట్టాలని అన్నారు . రైతులకు విద్యుత్ అంతరాయాలు కలగకుండా నిరంతరాయంగా సరఫరా అందించాలని ఆదేశించారు . ?

అంతేకాక సబ్‌స్టేషన్ల యార్డ్ పరిసరాలను అన్నివేళలా శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు . విద్యుత్ మౌలిక సదుపాయాల పై సీఎండీ చర్చిస్తూ, వినియోగదారులకు, నాణ్యమైన విద్యుత్ సేవలు అందించాలన్న సంకల్పంతో ముందుకు వెళ్లాలని చెప్పారు . ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ సెస్ బాధ్యతలు స్వీకరించే సమయానికి (ఏప్రిల్ 1) పెండింగ్‌లో ఉన్న 2491 వ్యవసాయ విద్యుత్ దరఖాస్తులను గుర్తించి , వీటిని వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టామని , ఇప్పటి వరకు 431 కనెక్షన్లు ఇచ్చామని, మిగిలిన వాటిని నెలవారీ ప్రాతిపదికన పూర్తి చేయాలని క్షేత్రస్థాయి అధికారులకు లక్ష్యాలను నిర్దేశించామన్నారు.

కొత్త కనెక్షన్ల కోసం వినియోగదారులు మీ-సేవ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు అని తెలిపారు. 'పొలం బాట/ప్రజా బాట' కార్యక్రమంలో భాగంగా వదులుగా ఉన్న విద్యుత్ తీగలను సరిచేయడం, మధ్యలో స్తంభాలను ఏర్పాటు చేయడం వంటి పనులను వేగవంతం చేశామని, అత్యవసర పరిస్థితుల కోసం 1000కి పైగా విద్యుత్ స్తంభాలను సిరిసిల్లలో సిద్ధంగా ఉంచామని , కరీంనగర్ స్టోర్స్ నుండి ?5 కోట్ల విలువైన మెటీరియల్ ఇప్పటికే సిరిసిల్లకు తరలించామన్నారు . అంచనాలు మరియు పనుల అమలులో పారదర్శకత కోసం 'హ్యూ' ఆధారిత సాఫ్ట్ వేర్ విధానాన్ని ప్రవేశపెట్టి, ఇంజనీర్లకు శిక్షణ ఇచ్చామని ,ః ఉన్నతాధికారులు నిరంతరం సిరిసిల్లలో పర్యటిస్తూ పనులను పర్యవేక్షిస్తారన్నారు.

రాజన్న సిరిసిల్ల జిల్లా వినియోగదారులకు నాణ్యమైన, అంతరాయం లేని విద్యుత్‌ను అందించేందుకు ఎన్పీడీసీఎల్క కట్టుబడి ఉందని, ఈ క్రమంలో వినియోగదారులు నెలవారీ విద్యుత్ బిల్లులను క్రమం తప్పకుండా చెల్లించాలని , గృహ జ్యోతి వంటి ప్రభుత్వ పథకాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలన్నారు సీ.ఎండీ వెంట రాజన్న సిరిసిల్ల సూపెరింటెండింగ్ ఇంజనీర్ బేతి బిక్షపతి, డివిజనల్ ఇంజనీర్ ఎన్ అంజయ్య తో పాటు ఏడీఈ శ్రీనివాస్, రాజలింగం , ఏ ఈ పృథ్విదర్ , ఏ ఓ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు .

# ప్రభుత్వ ఆసుపత్రిలో అభివృద్ధి పనులు పూర్తి చేయాలి: కలెక్టర్ గరిమ అగ్రవాల్

**సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశాన్ని నిర్వహించిన కలెక్టర్**



సిరిసిల్ల ( ప్రశ్న న్యూస్) జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అభివృద్ధి పనులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ, ఆసుపత్రి అభివృద్ధి కోసం చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతి సమీక్షించి పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. గత మూడు నెలల్లో ఔట్ పేషెంట్ లు 60,579 మంది, ఇన్ పేషెంట్ 3,939 మంది నమోదు అయ్యారని వైద్యులు తెలిపారు. జనవరి నుంచి మేజర్ ఆపరేషన్లు 365, మైనర్ ఆపరేషన్లు 993 చేశామని వెల్లడించారు. స్త్రీ ప్రసూతి విభాగం లో సిజేరియన్ల సంఖ్య 416, సాధారణ ప్రసవాల సంఖ్య 111 అయ్యాయని తెలిపారు. ఆసుపత్రిలో నెలకు సగటున 3,700 ఎక్స్ రేలు, 2,200 కి పైగా యూ ఎస్ జీ స్కానింగ్ లు చేశామని వివరించారు.

మూడు నెలల్లో కలిపి మొత్తం 1,844 స్కాన్లు తీశామని తెలిపారు. ఆరోగ్య శ్రీ లో భాగంగా జనవరి నుంచి మార్చి వరకు మొత్తం 1,012 ఓపీ కేసులు, 838 ఇన్ పేషెంట్ కేసులు నమోదయ్యాయని, జనవరి నుంచి మార్చి వరకు 59 కుటుంబ నియంత్రణ కేసులు చేశామని వెల్లడించారు. సమావేశంలో సిరిసిల్ల మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రవీణ్ కుమార్, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరి, ఆర్ ఎం ఓ డాక్టర్ సంతోష్ కుమార్, జిల్లా వైద్యాధికారి రజిత తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ ఆశయాలే సమాజానికి దిక్సూచి

- రాజ్యాంగ విలువలను కాపాడాలి
- ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కమిటీ జిల్లా సభ్యులు, బోయినిపల్లి సెస్ డైరెక్టర్ : కొట్టెపల్లి సుధాకర్



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) ఏప్రిల్ 14, నేడు మంగళవారం భారత రాజ్యాంగ శిల్పి డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కమిటీ రాజన్న సిరిసిల్ల జిల్లా సభ్యులు,బోయినిపల్లి సెస్ డైరెక్టర్ కొట్టెపల్లి సుధాకర్ జిల్లా ప్రజలకు అంబేద్కర్ జయంతి వేడుకల శుభాకాంక్షలు తెలియజేస్తూ సందేశం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అంబేద్కర్ ఆశయాలు సమాజంలో సమానత్వం,న్యాయం, స్వాభిమానాన్ని నెలకొల్పడానికి మార్గదర్శకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ విద్యను ఆయుధంగా తీసుకొని ముందుకు సాగాలని, అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అంబేద్కర్ చూపిన దారిలో నడుస్తూ రాజ్యాంగ విలువలను కాపాడడం ప్రతి పౌరుడి బాధ్యత అని ఆయన అన్నారు. ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న అణచివేతలను ఎదుర్కొనేందుకు చట్టాలు ఉన్నప్పటికీ,సమాజంలో అవగాహన పెరగడం అత్యవసరం అని తెలిపారు. సమాజంలో సామరస్య వాతావరణం నెలకొల్పేందుకు అందరూ కలిసి పని చేయాలని, యువత అంబేద్కర్ ఆశయాలను తెలుసుకొని వాటిని ఆచరణలో పెట్టాలని జిల్లా ప్రజలకు కొట్టెపల్లి సుధాకర్ విజ్ఞప్తి చేశారు.

# అణగారిన వర్గాల అభ్యున్నతికి అంబేద్కర్ కృషి అపారం

- ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలను నిర్వహించాలి
- కాంగ్రెస్ పార్టీ నర్సింగాపూర్ గ్రామ అధ్యక్షులు : లింగంపల్లి శ్రీనివాస్



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం, నర్సింగాపూర్ గ్రామ శాఖ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లింగంపల్లి శ్రీనివాస్ నేడు మంగళవారం డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ భారత రాజ్యాంగ నిర్మాతగా, సామాజిక న్యాయం కోసం జీవితాంతం పోరాడిన మహానేతగా నిలిచారని అన్నారు. సమాజంలో అణగారిన వర్గాల అభివృద్ధికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. అంబేద్కర్ చూపిన "విద్య పొందండి, సంఘటితమవండి, పోరాడండి" అనే మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలని పిలుపునిచ్చారు. సమానత్వం, న్యాయం, స్వాభిమానం వంటి విలువలు ప్రతి ఒక్కరి జీవితంలో ప్రతిఫలించాలని ఆయన సూచించారు. అంబేద్కర్ ఆశయాలను కొనసాగించడం ద్వారా సమాజంలో అసమానతలను తొలగించి, నిజమైన ప్రజాస్వామ్యాన్ని సాధించవచ్చని శ్రీనివాస్ పేర్కొన్నారు.

# టిడ్కో ఇల్లు అందజేత ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి





శ్రీకాళహస్తి,( ప్రశ్న న్యూస్ ) శ్రీకాళహస్తి పేదవారి సొంత ఇంటి కల నెరవేర్చుకునే దిశగా ఈనెల 15వ తేదీన లబ్ధిదారులకు టిడ్కో ఇల్లు అందజేత ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి. శ్రీకాళహస్తి పేదవారి సొంత ఇంటి కల నెరవేర్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన టిడ్కో గృహాల గృహప్రవేశం ఈనెల 15వ తేదీన అత్యంత వేడుకగా నిర్వహించి లబ్ధిదారులకు టిట్కో గృహాలను అందజేస్తున్నామని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ మంత్రి తన తండ్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి జయంతిని పురస్కరించుకొని ఈ నెల 15వ తేదీన 1648 టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అందజేస్తున్నామని తెలియజేశారుకూటమి ప్రభుత్వం పేదలకు నేడు లక్ష గృహాలను అందించనుంది. 2017-19 మధ్య తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే చాలా వరకూ టిడ్కో గృహాల నిర్మాణం పూర్తయింది. 300, 365, 430 చదరపు అడుగుల విస్తీర్ణమున్న ఫ్లాట్లతో గృహ సముదాయాలు నిర్మించారు. మౌలిక వసతులు కల్పించి లబ్ధిదారులకు చేతికందించాల్సిన సమయంలో ప్రభుత్వం మారింది. 2019 తర్వాత వైఎస్సార్?సీపీ ప్రభుత్వం కనీస మౌలిక సదుపాయాలు కల్పించకుండా ఐదేళ్లు కాలక్షేపం చేసి లబ్ధిదారుల్ని ఇబ్బందులకు గురిచేసింది. ఆ పార్టీ రంగులు వేసి ఆర్భాటం చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయడంతో పాటు మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి పెట్టింది. నిధులు కేటాయించి సకాలంలో పనులు పూర్తిచేసింది. సిమెంటు రోడ్లు, తాగునీటి సౌకర్యం, డ్రైనేజీ సదుపాయం ఇలా అన్ని వసతులతో లబ్ధిదారులకు ఇళ్లు అందిస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 21 నెలల్లో రెండోసారి ఇళ్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపడుతోంది. 3 లక్షల ఇళ్లను గతేడాది లబ్ధిదారులకు అప్పగించామని. ప్రస్తుతం రాష్ట్రంలో లక్ష టిడ్కోగృహాలతో పాటు కాలనీల్లో నిర్మించిన లక్షన్నర ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు ఇస్తున్నారు. ఇది కూటమి ప్రభుత్వం యొక్క పరిపాలనకు నిదర్శనం అని, పరిపాలన రక్షకుడు ప్రజారక్షకుడైన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇలా తను ఇచ్చిన వాగ్దానాలను పూర్తిస్థాయిలో అమలు చేస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారని తెలియజేశారు.

# శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయంలో శ్రీ భాష్యకార్ల ఉత్సవం ప్రారంభం



తిరుపతి(ప్రశ్న న్యూస్) శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయంలో శ్రీ భాష్యకార్ల (శ్రీ రామానుజాచార్యులు) ఉత్సవాలు సోమవారం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా ఏప్రిల్ 21న భోగి తేరు, ఏప్రిల్ 22న సాత్తుమొర, ఏప్రిల్ 23న గంధపొడి ఉత్సవం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ప్రతిరోజు ఉదయం భాష్యకార్ల వారికి బంగారు తిరుచ్చిపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో, సాయంత్రం పెద్ద వీధి ఉత్సవం వైభవంగా చేపడుతారు. అదేవిధంగా ప్రతిరోజు దివ్యప్రబంధ సేవాకాలం, సాత్తుమొర, ఆస్థానం నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో ప్రధానార్చకులు శ్రీనివాస దీక్షితులు, ఆలయ డెప్యూటీ ఈవో వి.ఆర్. శాంతి, ఏఈవో ఏబీ నారాయణ చౌదరి, సూపరింటెండెంట్ చిరంజీవి, టెంపుల్ ఇన్స్పెక్టర్ ధనుంజయ, తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ కప్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

- యువత క్రీడాస్ఫూర్తితో ముందుకు రావాలి
- గ్రామీణ క్రీడాకారుల ప్రతిభను వెలికితీయడమే లక్ష్యంగా "కేసీఆర్ కప్" క్రీడా పోటీలు
- చొప్పదండి మాజీ ఎమ్మెల్యే : సుంకె రవిశంకర్
- యువతకు ప్రోత్సాహం - క్రీడా దుస్తులు పంపిణీ





బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) చొప్పదండి నియోజకవర్గం, బోయినిపల్లి మండలం,స్థంభంపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న కేసీఆర్ కప్ క్రికెట్ టోర్నమెంట్‌ను చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా టోర్నమెంట్‌లో పాల్గొనే క్రీడాకారులకు క్రికెట్ కిట్లు, క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుంకె రవిశంకర్ మాట్లాడుతూ, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదేశాల మేరకు సిరిసిల్ల జిల్లాలోని అన్ని మండలాల్లో ఈ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండల స్థాయిలో విజేత జట్టుకు రూ.50 వేల నగదు బహుమతి, రన్నరప్ జట్టుకు రూ.20 వేల ప్రైజ్ మనీ అందజేస్తారని చెప్పారు. ప్రతి మండలం నుంచి రెండు జట్లు ఎంపికై, మొత్తం 12 మండలాలు, 2 మున్సిపాలిటీల నుంచి 32 జట్లు జిల్లా స్థాయిలో పోటీపడనున్నట్లు వివరించారు. ఈ పోటీలు ఈ నెల 10 నుంచి 17వ తేదీ వరకు మండల, మున్సిపాలిటీ స్థాయిలో లీగ్ మ్యాచ్‌ల రూపంలో జరుగుతాయని, అనంతరం 18 నుంచి 25 వరకు జిల్లా కేంద్రంలో తుది పోటీలు నిర్వహిస్తారని తెలిపారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, యువత క్రీడాస్ఫూర్తిని పాటిస్తూ ముందుకు సాగాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభావంతమైన క్రీడాకారులను వెలికితీయడం ఈ కేసీఆర్ కప్ ముఖ్య ఉద్దేశమని పేర్కొంటూ, టోర్నమెంట్‌లో పాల్గొంటున్న అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ లెంకల సత్యనారాయణ రెడ్డి, మాజీ మండల కో-ఆప్షన్ సభ్యుడు మహమ్మద్ ఆజ్మా, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి గుంటి శంకర్, మాజీ సర్పంచ్ చిందం రమేష్, కొప్పుల మల్లేశం, నాయకులు అక్కెనపల్లి కరుణాకర్, బత్తిని కమల్ గౌడ్,రాములు,బోయిని రాజు, సంజీవ్, కన్నం సాగర్, కోటి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో సమస్యల ఏకరువు

- గిర్మాపూర్ రోడ్డు గుంతలతో ప్రయాణికుల అవస్థలు
- నిలిచిపోయిన హౌసింగ్ బోర్డు కాలనీ రోడ్డు పనులు
- రహదారుల మరమ్మతులు చేపట్టాలని బిజెపి నాయకుల డిమాండ్



మేడ్చల్ (ప్రశ్న న్యూస్ ) మేడ్చల్ పట్టణ పరిధిలోని పలు ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బిజెపి నాయకులు సోమవారం మేడ్చల్ సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అధికారులకు వినతిపత్రం సమర్పించారు. మేడ్చల్ నుండి గిర్మాపూర్ వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయంగా మారి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే ఆ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని వారు కోరారు. అదేవిధంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగక ప్రజలు చీకట్లో అవస్థలు పడుతున్నారని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మేడ్చల్ హౌసింగ్ బోర్డు కాలనీ నుండి గ్రంథాలయం వరకు అసంపూర్తిగా ఉన్న రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని విన్నవించారు. తమ విన్నపంపై సానుకూలంగా స్పందించి యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ పురపాలక మాజీ బిజెపి అధ్యక్షులు కొండం ఆంజనేయులు ముదిరాజ్, బిజెపి సీనియర్ నాయకులు బొక్క అంజి రెడ్డి, బీజేవైఎం జిల్లా కార్యదర్శి రాఘవ రెడ్డి, మేడ్చల్ డివిజన్ బిజెపి కార్యదర్శి బండి విష్ణు గౌడ్, బిజెపి యువ నాయకులు రాగం ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# టీడీపీ ప్రభుత్వంలోనే హజ్ కమిటీకి నిజమైన స్వేచ్ఛ

- ప్రభుత్వ సలహాదారు ఎంఏ షరీఫ్
- హజ్ కమిటీపై సాక్షి పత్రిక ప్రచారం అంతా అబద్ధం




మంగళగిరి (ప్రశ్న న్యూస్) సాక్షి దినపత్రికలో, వైఎస్ఆర్సీపీ నాయకులు హజ్ కమిటీ నియామకాలపై చేస్తున్న అసత్య ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామని ప్రభుత్వ మైనారిటీ వ్యవహారాల సలహాదారు ఎంఏ షరీఫ్ అన్నారు. "కోడిగుడ్డు మీద ఈకలు పీకే" చందంగా, కేవలం రాజకీయ లబ్ధి కోసమే ముస్లిం సోదరులను తప్పుదోవ పట్టించేలా ఈ వార్తలు ఉన్నాయని విమర్శించారు. నేడు టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత ఎన్డీయే కూటమి ప్రభుత్వం హజ్ యాత్రికుల సౌకర్యార్థం, హజ్ యాత్ర పట్ల పవిత్ర భావన, అనుభవం ఉన్న వ్యక్తులతోనే కమిటీని ఏర్పాటు చేసింది. ఇందులో ఎటువంటి దురుద్దేశం లేదు. గత జీవో (జీవో 38)లో కొన్ని సాంకేతిక అంశాలకు సంబంధించి హైకోర్టులో పిటిషన్ దాఖలైన మాట వాస్తవం. ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించే మా ప్రభుత్వం, ఆ లోపాలను గుర్తించి వెంటనే సరిదిద్దింది. పాత జీవోలోని సభ్యులను కొనసాగిస్తూనే, నిబంధనల ప్రకారం కొత్త జీవోను జారీ చేయడం జరిగింది. ఇది ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం. స్థానిక సంస్థల కోటాలో ఎన్నికైన కొందరు సభ్యుల పదవీ కాలం ముగిసిన మాట వాస్తవం. అయితే, వారి స్థానంలో కొత్తవారిని నియమించాలా లేదా వారు కొనసాగాలా అనేది పూర్తిగా చట్టపరమైన, సాంకేతికపరమైన ప్రక్రియ. దీనికి సంబంధించి అధికారులు నిబంధనల ప్రకారం నిర్ణయం తీసుకుంటారు. ఈ చిన్న అంశాన్ని ఏదో "కొంపలు అంటుకున్నట్టు", హజ్ పవిత్రతకు భంగం కలిగినట్టు చిత్రీకరించడం హాస్యాస్పదం. ముగ్గురు సభ్యుల విషయంలో సాక్షి పత్రిక తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తోంది. ఏదైనా సమస్య ఉంటే చర్చల ద్వారా పరిష్కరించుకోవాలి తప్ప, అసత్య ప్రచారాలతో సమాజంలో అశాంతి రేపాలని చూస్తే ముస్లిం సోదరులే మీకు బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

# విలాసాగర్ గ్రామంలో రోడ్డు భద్రతపై ప్రత్యేక గ్రామ సభ




బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని విలాసాగర్ గ్రామపంచాయతీలో '99 రోజుల ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా రోడ్డు భద్రతపై ప్రత్యేక గ్రామ సభను సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బోయినిపల్లి ఎస్సై




రమాకాంత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామ సర్పంచ్ ఏనుగుల కనుకయ్య,వార్డు సభ్యులు, వివిధ శాఖల అధికారులు, యువత, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామ సభలో రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ట్రాఫిక్ నిబంధనల ప్రాముఖ్యత, ప్రజల్లో అవగాహన పెంపుపై అధికారులు వివరించారు. గ్రామస్థులు కూడా తమ అభిప్రాయాలు వ్యక్తం చేస్తూ రోడ్డు భద్రతకు సంబంధించిన సమస్యలను వెల్లడించారు. ఈ సందర్భంగా అధికారులు ప్రజలు ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని, సురక్షిత ప్రయాణానికి సహకరించాలని సూచించారు.

# సింహగిరిపై చందనోత్సవం ఏర్పాట్లు పరిశీలించిన హోం మంత్రి అనిత

- పార్కింగ్, తాగునీరు, వైద్య సదుపాయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి
- సామాన్య భక్తుల దర్శనాలకు ప్రాధాన్యత ఇస్తున్నాం



సింహాచలం(ప్రశ్న న్యూస్ )ఆంధ్రప్రదేశ్ హోం మంత్రి వంగలపూడి అనిత, ప్రముఖ పుణ్యక్షేత్రం సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి వారిని సోమవారం దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన మంత్రికి అధికారులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం ఆమెకు వేద పండితులు ఆశీర్వచనం అందించారు. ఈ నెల 20న జరగనున్న స్వామివారి చందనోత్సవాన్ని పురస్కరించుకుని సింహగిరిపై జరుగుతున్న ఏర్పాట్లను మంత్రి సమీక్షించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని మౌలిక వసతులు కల్పించాలని అధికారులకు పలు సూచనలు చేశారు. ముఖ్యంగా పార్కింగ్, తాగునీరు, వైద్య సదుపాయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. చందనోత్సవం సందర్భంగా భారీగా భక్తులు రానున్న నేపథ్యంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీసులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు. అదేవిధంగా ఎన్‌డిఆర్ఎఫ్, ఎస్‌డిఆర్ఎఫ్ బృందాలను ఆలయం వద్ద సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. సీసీటీవీ కెమెరాల ద్వారా కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి నిరంతర పర్యవేక్షణ నిర్వహించడంతో పాటు, ఆధునిక ఏఐ టెక్నాలజీని వినియోగించాలన్నారు. భక్తులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు విస్తృతంగా పంపిణీ చేయాలని సూచించారు. ఈ ఏర్పాట్లు పరిశీలనలో విశాఖ నగర పోలీస్ కమిషనర్ శంక బ్రత బాగ్చి, జాయింట్ కలెక్టర్ విద్యాధరి, సింహాచలం ఆలయ ఈవో వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.



## త్రిష ఇంటికి బాంబు

# బెదిరింపు

చెన్నైలో ప్రముఖ నటి త్రిష కృష్ణన్ నివాసానికి బాంబు బెదిరింపు రావడం కలకలం రేపింది. గుర్తుతెలియని వ్యక్తులు ఈమెయిల్ ద్వారా పంపిన ఈ హెచ్చరికతో పోలీసులు వెంటనే అప్రమత్తమయ్యారు. పూర్తి వివరాల్లోకి వెళితే... చెన్నైలోని తేనాంపేట్ ప్రాంతంలో ఉన్న త్రిష నివాసంలో బాంబు పెట్టినట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు ఆ ప్రాంతాన్ని తక్షణమే తమ ఆధీనంలోకి తీసుకుని, భద్రతను కట్టుదిట్టం చేశారు. బాంబ్ స్క్వాడ్ నిపుణులు రంగంలోకి దిగి ఇంటి లోపల, పరిసర ప్రాంతాల్లో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. అయితే, ఎక్కడా ఎలాంటి పేలుడు పదార్థాలు లభించకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ బెదిరింపు కేవలం ఒక తప్పుడు సమాచారం అని పోలీసులు ధృవీకరించారు. ఈ తప్పుడు బెదిరింపు ఈమెయిల్ ఎక్కడి నుండి వచ్చింది? ఎవరు పంపారు? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. నిందితులను గుర్తించేందుకు సైబర్ క్రైమ్ విభాగం సాంకేతిక ఆధారాలను సేకరిస్తోంది. ప్రజల్లో భయాందోళనలు కలిగించే ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. ప్రముఖుల నివాసాలను లక్ష్యంగా చేసుకుని వస్తున్న ఇలాంటి బెదిరింపుల నేపథ్యంలో, చెన్నై పోలీసులు నగరంలోని సెలబ్రిటీల ఇళ్ల వద్ద నిఘాను పెంచారు. ఈ ఘటనతో త్రిష అభిమానులు కాస్త ఆందోళనకు గురైనప్పటికీ, అది వదంతి అని తేలడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

# 'డార్క్ నైట్' మూవీ రివ్యూ!



పూర్ణ ప్రధాన పాత్రలో నటించిన సినిమానే 'డార్క్ నైట్'. ఆదిత్య దర్శకత్వం వహించిన ఈ సినిమా, మార్చి 13వ తేదీన థియేటర్లకు వచ్చింది. అయితే పెద్దగా పబ్లిసిటీ లేకపోవడం వలన, అంతగా ఆడియన్స్ కి ఈ సినిమా రీచ్ కాలేకపోయింది. అలాంటి ఈ సినిమా, ఈ నెల 10వ తేదీ నుంచి 'ఆహా'లో స్ట్రీమింగ్ అవుతోంది. ఎమోషనల్ థ్రిల్లర్ గా రూపొందిన ఈ సినిమా కథేమిటనేది ఇప్పుడు చూద్దాం. హేమ (పూర్ణ)కి .. అలెక్స్ (విధార్థ్)కి వివాహమవుతుంది. అలెక్స్ ఎప్పుడూ బిజీగా ఉండే ఒక లాయర్. అతను హేమకి ఒక ఖరీదైన జీవితాన్ని ఇస్తాడు. ఆయన నుంచి హేమ ప్రేమానురాగాలను ఆశిస్తుంది. అయితే అతను వాటికి చాలా దూరంగా కనిపిస్తూ ఉంటాడు. హేమ ఫీలింగ్స్ ను ఎంతమాత్రం పట్టించుకోకుండా అతను తన పని చేసుకు వెళుతుంటాడు. అందుకు కారణం సోఫియా ( శుభశ్రీ) అనే విషయం హేమకి తెలుస్తుంది. అలెక్స్ ఆఫీసులో సోఫియా పనిచేస్తూ ఉంటుంది. ఆమెతో అతను అక్రమ సంబంధం పెట్టుకుంటాడు. భార్యకి అలెక్స్ దూరం కావడంలో సోఫియా ప్రధానమైన పాత్రను పోషిస్తూ ఉంటుంది. వాళ్లిద్దరి మధ్యనున్న అక్రమ సంబంధం హేమకి తెలుస్తుంది. అప్పటి నుంచి ఆమెకి రోజులు భారంగా గడుస్తూ ఉంటాయి. అలాంటి పరిస్థితుల్లోనే ఆమె ఒక రోజున రోషన్ (త్రిగుణ్) అనే ఒక యువకుడికి కార్ తో డ్యాష్ ఇస్తుంది. అప్పటి నుంచి వాళ్లిద్దరి మధ్య పరిచయం పెరుగుతుంది.తన భర్త తన పట్ల ప్రేమగా లేకపోవడం వల్లనే తాను రోషన్ కి చేరువ కావడానికి ట్రై చేస్తున్నానేమో అనే ఒక ఆలోచన హేమకి వస్తుంది. దాంతో ఇకపై తమ మధ్య కాస్త దూరంగా ఉండటం మంచిదని రోషన్ తో చెబుతుంది. తనకు దగ్గరవుతుందని భావించిన హేమ, తిరిగి దూరంగా వెళుతుండటాన్ని రోషన్ తట్టుకోలేకపోతాడు. అప్పుడు అతను ఏం చేస్తాడు? అతను తీసుకున్న ఆ నిర్ణయం ఎలాంటి పరిణామాలకు దారితీస్తుంది? అనేది కథ.ఈ కథ మూడు ప్రధానమైన పాత్రల చుట్టూ నడుస్తుంది. మిగిలిన పాత్రలు నామ మాత్రంగా కనిపిస్తాయి .. అవి కూడా కొన్నే. తనని పట్టించుకోని భర్త .. తనని మాత్రమే పట్టించుకునే ఓ పరిచయస్తుడు .. ఆ ఇద్దరి మధ్య ఎటూ తేల్చుకోలేని యువతిగా పూర్ణ. ఈ మూడు పాత్రలే ఈ కథలో ప్రధానమైనవిగా కనిపిస్తాయి. నాలుగో ప్రధానమైన పాత్ర అనేది తెరపై కనిపించదు. ఫస్టాఫ్ లో చాలావరకూ వివాహమైన ఒక యువతికీ, అనుకోకుండా ఆమెకి పరిచయమైన ఒక యువకుడికి మధ్య జరుగుతుంది. వాళ్లిద్దరి మధ్య సంబంధం హద్దులు దాటబోతుండగా ఆమె భర్త పాత్ర ఎంట్రీ ఇస్తుంది. అక్కడి నుంచి సెకండాఫ్ గా ఈ కథ మరింత పుంజుకుంటుంది. వివాహమైంది గనుక ఆ బంధానికి ఆమె కట్టుబడి ఉంటుందా? తన భర్త చూపించని ప్రేమ వేరొకరు అందిస్తున్న కారణంగా అటువైపు మొగ్గు చూపుతుందా? అనేది ఆసక్తికరమైన అంశంగా మారుతుంది.వైవాహిక జీవితం – అక్రమ సంబంధం అనే రెండు అంశాల చుట్టూ అల్లుకోబడిన కథ ఇది.వైవాహిక జీవితం నమ్మకంపై నడుస్తుందని అంటారు. ఆ నమ్మకమే కోల్పోయినప్పుడు ఆ జంట ఇక ఆనందకరమైన జీవితాన్ని కొనసాగించలేదు అనడానికి అనేక నిదర్శనాలు కనిపిస్తూ ఉంటాయి. తన భర్త తనని మోసం చేస్తున్నాడని భార్య భావించినప్పుడు, తాను కూడా అదే తప్పు చేస్తే తప్పేంటి? అనే ఆలోచన కొంతమందికి రాకుండా ఉండదు. అలాగే భర్త ప్రేమకి దూరమైనయువతి .. ఆ ప్రేమను అందించేవారి పట్ల ఆసక్తిని కనబరచడం కూడా సహజంగా జరుగుతూ ఉంటుంది. ఇదే అదనుగా భావించి ఆ ఇద్దరి జీవితాల్లోకి ప్రవేశించే మోసగాళ్లు మరికొంతమంది ఉండనే ఉంటారు. అలా దర్శకుడు ఈ కథను మూడు కోణాలలో ఆవిష్కరించాడు. మన చుట్టూ తిరుగుతున్న పాత్రలనే మనం తెరపై చూస్తున్న ఫీలింగ్ కలుగుతుంది. అక్రమ సంబంధాల దిశగా సాగే అన్ని కథలకు దాదాపుగా ఒకే ముగింపు ఉంటుంది. చంపడమో .. చావడమో. అదే దారిలో నడిచే ఈ కథకు దర్శకుడు ఇచ్చిన ముగింపు ఏమిటనేది ఆడియన్స్ లో ఆసక్తిని రేకెత్తిస్తుంది. భార్యాభర్తల మధ్య గొడవలు తలెత్తడం సహజం.. అయితే ఆ గొడవలను తమకి అనుకూలంగా మార్చుకునే వ్యక్తులు చుట్టూనే ఉంటారు. అలాంటి వాళ్ల విషయంలో జాగ్రత్తగా ఉండాలనే విషయాన్ని చాటే కాన్సెప్ట్ ఇది. 'డార్క్ నైట్' నేపథ్యంలో ప్రధానంగా నడిచే కథ కావడం వలన, ఈ టైటిల్ ను సెట్ చేశారు. దర్శకుడు ఎంచుకున్న ఈ కథ కొత్తదేమీ కాదు, ఇంతకు ముందు ప్రేక్షకులకు పరిచయం లేనిది కాదు. గతంలో ఈ కాన్సెప్ట్ తో చాలా సినిమాలే వచ్చాయి.

అలాంటి కాన్సెప్ట్ ను మరింత సింపుల్ గా చెప్పడానికి ట్రై చేశారు. క్లైమాక్స్ ను డిజైన్ చేసిన విధానం కొత్తగా అనిపించకపోగా కాస్త గందరగోళంలోకి నెడుతుంది. ప్రధానమైన పాత్రలను పోషించిన ఆర్టిస్టులంతా చాలా బాగా చేశారు. పూర్ణ నటన ప్రత్యేకమైన ఆకర్షణగా చెప్పుకోవాలి. కార్తీక్ ముత్తుకుమార్ అందించిన ఫొటోగ్రఫీ .. మిస్కిన్ నేపథ్య సంగీతం ఓ మాదిరిగా అనిపిస్తాయి. రొటీన్ కథను మరింత సింపుల్ గా చెప్పడానికి ప్రయత్నించడమే ఈ కథలో కనిపించే ప్రధానమైన లోపమని చెప్పుకోవాలి.

## కొత్త లుక్‌లో రామ్ చరణ్...

### 'ఎస్క్వైర్' కవర్‌పై పవర్‌ఫుల్‌గా గ్లోబల్ స్టార్!



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ మరోసారి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. ప్రఖ్యాత 'ఎస్క్వైర్ ఇండియా' మ్యాగజైన్ లేటెస్ట్ ఎడిషన్ కవర్ పేజీపై ఆయన మెరిశారు. ఈ సందర్భంగా మ్యాగజైన్, రామ్ చరణ్‌ను "ప్రస్తుత తరాన్ని ప్రభావితం చేస్తున్న గ్లోబల్ ఫోర్స్" అని, "భారతీయ సినిమాకు ఒక ముఖ్యమైన ముఖచిత్రంగా నిలిచారు" అని అభివర్ణించింది."రామ్ చరణ్ సినీ ప్రయాణాన్ని సెలబ్రేట్ చేస్తూ, ఆయన్ను మునుపెన్నడూ చూడని సరికొత్త రూపంలో మా కవర్‌పై ఆవిష్కరిస్తున్నాం" అని ఎస్క్వైర్ ఇండియా తన కథనంలో పేర్కొంది. ఈ ఫోటోషూట్‌ను ప్రత్యేకంగా హాంకాంగ్‌లో నిర్వహించినట్లు సమాచారం. ప్రస్తుతం రామ్ చరణ్, బుచ్చిబాబు సానా దర్శకత్వంలో 'పెద్ది' చిత్రంలో నటిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ నుంచి స్వల్ప విరామం తీసుకుని ఆయన హాంకాంగ్‌లో జరిగిన ఈ ఫోటోషూట్‌లో పాల్గొన్నారు. విశేషమేమిటంటే, 'పెద్ది' సినిమా కోసం మెయింటైన్ చేస్తున్న హెయిర్‌స్టైల్‌తోనే ఆయన ఈ షూట్‌లో కనిపించారు. దీంతో ఆయన లుక్‌పై అభిమానుల్లో మరింత ఆసక్తి పెరిగింది. ప్రస్తుతం ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

## యోధుడిగా

# అరవింద్ కృష్ణ..

### - కర్మస్థలం నయా లుక్ వైరల్




తెలుగు ప్రేక్షకులకు పెద్దగా ఇంట్రడక్షన్ అవసరం లేని యాక్టర్ అరవింద్ కృష్ణ (ూతీజఆఅఎ ఖతీఅంప్త్రఉ). బ్యాక్ టు బ్యాక్ సినిమాలను లైన్‌లో పెట్టిన ఈ టాలెంటెడ్ యాక్టర్ లీడ్ రోల్‌లో నటిస్తోన్న మరో చిత్రం కర్మ స్థలం (ఖుతీఝుర్ఖుశ్రీఖుఎ). రాకీ షెర్మాన్ దర్శకత్వం వహిస్తున్నాడు. రాయ్ ఫిల్మ్స్ సమర్పణలో రాకీ షెర్మాన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో రిలీజ్ కానున్న ఈ మూవీ నుంచి మేకర్స్ నయా పోస్టర్ విడుదల చేశారు. తాజాగా అరవింద్ కృష్ణ రోల్‌కు సంబంధించిన లుక్ రిలీజ్ చేయగా.. ఇందులో ఓ యోధుడిగా కనిపించబోతున్నట్టు హింట్ ఇచ్చేశారు మేకర్స్.ఇప్పటివరకు షేర్ చేసిన పోస్టర్లకు మంచి రెస్పాన్స్ వస్తోంది. ఒక్కో పోస్టర్ సినిమాపై క్యూరియాసిటీ రేకెత్తిస్తోంది. ఈ మూవీలో చుంకీపాండే, అర్చనా శాస్త్రి, ప్రిన్స్, దివి. కాలకేయ ప్రభాకర్, వెంకేటేశ్ ముమ్మిడి, వినోద్, బలగం సంజయ్, దిల్ రమేశ్, నాగ మహేశ్, వినోద్ అల్వ, మిథాలీ చౌహాన్, కిల్లి క్రాంతి ఇతక కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ మూవీకి సాయి కార్తీక్ సంగీతం అందిస్తున్నాడు. ఈ మూవీకి విజువల్స్‌తోపాటు బీజీఎం స్పెషల్ అట్రాక్షన్‌గా నిలువబోతున్నట్టు తాజా లుక్ హింట్ ఇచ్చేస్తుంది.

## 'భరతవర్ష: సాగా ఆఫ్ శూల'...

## గోపీచంద్ కొత్త చిత్రానికి పవర్ ఫుల్ టైటిల్



మాస్ హీరో గోపీచంద్ తన 33వ చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ సినిమాకు 'భరతవర్ష : సాగా ఆఫ్ శూల' అనే శక్తివంతమైన టైటిల్‌ను ఖరారు చేస్తూ, సోమవారం టైటిల్ గ్లింప్స్ వీడియోను విడుదల చేశారు. ఇందులో గోపీచంద్ మునుపెన్నడూ కనిపించని రీతిలో వారియర్ అవతారంలో ఆకట్టుకున్నారు. భీకర యుద్ధ సన్నివేశాలతో ఈ గ్లింప్స్ సినిమాపై అంచనాలను పెంచింది. ఈ చిత్రం 7వ శతాబ్దం నాటి అవిభక్త భారతదేశంలో జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా తెరకెక్కుతోంది. చారిత్రక అంశాలకు పౌరాణిక నేపథ్యాన్ని జోడించి దర్శకుడు సంకల్ప్ రెడ్డి దీన్ని రూపొందిస్తున్నారు. గ్లింప్స్‌లో కనిపించిన గ్రాండ్ విజువల్స్, ఉత్కంఠభరితమైన నేపథ్య సంగీతం సినిమా స్థాయిని తెలియజేస్తున్నాయి. గోపీచంద్ కెరీర్‌లోనే అత్యధిక బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ బ్యానర్‌పై శ్రీనివాస్ చిట్టూరి నిర్మిస్తున్నారు. అనుదీప్ దేవ్ సంగీతం అందిస్తున్నారు. ఈ సినిమాలో గోపీచంద్‌కు జోడీగా రీతూ వర్మ నటిస్తోంది.

గత కొంతకాలంగా సరైన విజయం కోసం ఎదురుచూస్తున్న గోపీచంద్‌కు ఈ భారీ హిస్టారికల్ యాక్షన్ చిత్రం కమ్‌బ్యాక్ ఇస్తుందని అభిమానులు ఆశిస్తున్నారు. విడుదల తేదీని త్వరలోనే అధికారికంగా ప్రకటించనున్నట్లు చిత్రబృందం తెలిపింది.

# మృణాల్ ఠాకూర్ కు నాగ్ అశ్విన్ కీలక సూచన



'సీతారామం' చిత్రంతో తెలుగు ప్రేక్షకుల హృదయాలను కొల్లగొట్టిన మృణాల్ ఠాకూర్, తాజాగా అడివి శేష్ సరసన నటించిన 'డెకాయిట్' చిత్రంతో మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నారు. ఈ సినిమా సక్సెస్ మీట్‌కు ముఖ్య అతిథిగా హాజరైన స్టార్ డైరెక్టర్ నాగ్ అశ్విన్, మృణాల్ నటనపై ప్రశంసల వర్షం కురిపించారు. ఆమెను భారతీయ చిత్ర పరిశ్రమలోని దిగ్గజ నటీమణులతో పోల్చారు. మృణాల్‌లోని నటనను, గ్రేస్‌ను అభినందిస్తూ.. గతంలో భారతీయ వెండితెరను ఏలిన స్మిత పాటిల్, మధుబాల వంటి లెజెండరీ నటీమణులు మృణాల్‌లో కనిపిస్తారని నాగ్ అశ్విన్ కొనియాడారు. "అంతటి గొప్ప నటీమణులు చాలా అరుదుగా ఉంటారు, మృణాల్ ఆ కోవకు చెందిన నటి" అని ఆయన పేర్కొన్నారు. కేవలం ప్రశంసించడమే కాకుండా, మృణాల్‌కు ఒక కీలకమైన సలహా కూడా ఇచ్చారు నాగ్ అశ్విన్. "నీవు చాలా గొప్ప స్థాయి ఉన్న నటివి. చిన్న చిన్న పాత్రలు లేదా ప్రాధాన్యత లేని సాధారణ క్యారెక్టర్లు చేసి నీ స్థాయిని తగ్గించుకోవద్దు. ఎప్పటికీ గుర్తుండిపోయే గొప్ప పాత్రలనే ఎంచుకో" అని ఆయన సూచించారు. ఒక అగ్ర దర్శకుడు బహిరంగంగా ఒక హీరోయిన్ కెరీర్ పట్ల ఇంతటి శ్రద్ధ చూపడం విశేషం. నాగ్ అశ్విన్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా, మృణాల్ అభిమానులు ఆమెను 'ఈ తరం మధుబాల' అంటూ సోషల్ మీడియాలో ట్రెండ్ చేస్తున్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ముందస్తు అంబేద్కర్ జయంతి వేడుకలు.




మంథని ( ప్రశ్న న్యూస్) ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంథనిలో ఐక్యూఏసి, ఎన్ఎస్ఎస్, చరిత్ర మరియు రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ముందస్తు అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపల్ పరిషయ్య అధ్యక్షత వహించి మాట్లాడుతూ ఈరోజు మనం అనుభవిస్తున్న ప్రతి అంశం వెనుక అంబేద్కర్ కృషి ఉందని అనేక దేశాల రాజ్యాంగాలను అవపోసన పట్టి మన భారత రాజ్యాంగాన్ని రచించారని తెలియజేశారు. భారత రాజ్యాంగం పట్ల యువత విధేయులుగా ఉంటూ భావితరాలకు ఆదర్శంగా నిలవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ కృష్ణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్. లక్ష్మీనారాయణ, చరిత్ర అసిస్టెంట్ ప్రొఫెసర్ సతీష్, అధ్యాపకులు అమర్నాథ్, ముకుందం, ఫర్జానా, మానస, దుర్గం కృష్ణ, శేఖర్ , శ్రీధర్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# గజ్వేల్ ప్రజ్ఞాపూర్ కో-ఆప్షన్ సభ్యునిగా అవకాశం ఇవ్వాలి

## – ఉద్యమ నాయకుడు మహమ్మద్ లతీఫ్ విన్నపం



గజ్వేల్( ప్రశ్న న్యూస్) సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పాలకవర్గంలో కో-ఆప్షన్ సభ్యునిగా తనకు అవకాశం కల్పించాలని ఉద్యమ నాయకుడు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మహమ్మద్ లతీఫ్ పార్టీ అధిష్టానాన్ని, స్థానిక నాయకత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ పట్ల తనకున్న నిబద్ధతను, తెలంగాణ ఉద్యమ సమయం నుండి, పార్టీ ఆవిర్భావం నుండి బిఆర్ఎస్ బలోపేతం కోసం ఒక క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా పనిచేశానని, గత రెండు మున్సిపల్ ఎన్నికలలో తాను పోటీకి సిద్ధపడినప్పటికీ, పార్టీ ప్రయోజనాల దృష్ట్యా అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి వెనక్కి తగ్గానని, రెండు పర్యాయాలు తనకు పోటీ చేసే అవకాశం దక్కలేదని, గత మున్సిపల్ ఎన్నికల సమయంలో పోటీ నుండి తప్పుకుంటే, ఖచ్చితంగా కో-ఆప్షన్ సభ్యునిగా అవకాశం కల్పిస్తామని అప్పట్లో నాయకులు హామీ ఇచ్చారన్నారు. పార్టీ కోసం నిరంతరం శ్రమిస్తున్న తనలాంటి కార్యకర్తలకు గుర్తింపునివ్వాలని, ఇచ్చిన హామీ మేరకు ఈసారి జరిగే కో-ఆప్షన్ సభ్యుల ఎన్నికలలో తనకు ప్రాధాన్యతనిచ్చి సేవలందించే అవకాశం కల్పించాలన్నారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు, ఉద్యమ సమయంలో వెన్నంటి నిలిచిన కార్యకర్తగా నాకు ఈసారి న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నాను అని అన్నారు.

# గుంట నక్కల చేతుల్లో బిఆర్ఎస్ పార్టీ బందీ

## యాదగిరి ముదిరాజ్ విమర్శలు



గజ్వేల్( ప్రశ్న న్యూస్ ) బిఆర్ఎస్ పార్టీ గుంట నక్కల చేతుల్లో బందీ అయిందని జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షులు కొట్టాల యాదగిరి ముదిరాజ్ తీవ్ర విమర్శలు చేశారు. సోమవారం గజ్వేల్లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జాగృతి అధ్యక్షురాలు కవితపై విమర్శలు చేయడం ద్వారా బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తన చేతగానితనాన్ని బయటపెట్టుకున్నారని ఆరోపించారు.పార్టీ మనుగడ కష్టాల్లో ఉన్న సమయంలో కవిత సాహసోపేత నిర్ణయాలు తీసుకుందని, అయితే కేటీఆర్ మాత్రం బాధ్యతలను తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. "తప్పులను సరిదిద్దుకుంటాం" అన్న కేటీఆర్ వ్యాఖ్యలతో పార్టీ ఓటమికి తామే బాధ్యులమని ఒప్పుకున్నట్టేనని పేర్కొన్నారు.పార్టీ అధినేత కేసీఆర్ తీవ్ర మనోవేదనలో ఉన్నారని చెప్పడం ద్వారా బిఆర్ఎస్ పతనావస్థకు చేరుకుందని స్పష్టమవుతోందని అన్నారు. గతంలోనే కవిత పార్టీ పరిస్థితిపై హెచ్చరించినప్పటికీ కేటీఆర్ పట్టించుకోలేదని, దాంతో పార్టీ పరిస్థితి దిగజారిందని విమర్శించారు. కవిత జైలుకు వెళ్లి కేసీఆర్ పరువు కాపాడిందని పేర్కొంటూ, ఆమె త్యాగాన్ని గుర్తించలేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో కవితకు పెరుగుతున్న ప్రజాదరణను చూసి కేటీఆర్ అసహనం వ్యక్తం చేస్తున్నారని ఆరోపించారు.రాష్ట్ర ఏర్పాటులో కవిత చేసిన ఉద్యమాలు, పోరాటాలు మరుగునపడ్డాయని, పార్టీ ప్రస్తుతం కమీషన్ల కోసం పనిచేసే రాజకీయ వేదికగా మారిందని విమర్శించారు. సంపూర్ణ వికాస తెలంగాణ లక్ష్యంగా కవిత చేపట్టిన ప్రయాణానికి మద్దతు ఇవ్వడం తప్ప కేటీఆర్ చేయగలిగిందేమీ లేదని యాదగిరి ముదిరాజ్ వ్యాఖ్యానించారు.

# జనగణన కోసం సూపర్ వైజర్లు, ఎన్యూమరేటర్ల నియామకం పూర్తి

## జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) జిల్లాలో జరగనున్న జనగణన కార్యక్రమానికి సంబంధించి సూపర్ వైజర్లు మరియు ఎన్యూమరేటర్ల నియామక ప్రక్రియను పూర్తిచేసినట్లు జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు సోమవారం హైదరాబాద్ నుండి కులగణన సంచాలకులు శ్రీమతి భారతి హోళికేరి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్లో ఆమె కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 26వ తేదీ నుండి మే 10వ తేదీ వరకు నిర్వహించబడనున్న సెల్ఫ్ ఎన్యూమరేషన్ ప్రక్రియపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. ముఖ్యంగా ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 1406 మంది ఎన్యూమరేటర్లు, 248 మంది సూపర్ వైజర్లను నియమించామని ఆయన వివరించారు. జనగణన ప్రక్రియను సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనగనన సూపరిండెంట్ గఫార్ , ఈడియం సందీప్ , సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ అసమర్థ పాలనలో ఆర్థిక వ్యవస్థ పతనం

## మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్.




గజ్వేల్ (ప్రశ్న న్యూస్) గజ్వేల్ మండలంలోని అహ్మదీపూర్ గ్రామానికి చెందిన ఆందోలు గణేష్ తండ్రి రాజయ్య అనారోగ్యంతో బాధపడుతూ నిమ్స్ హాస్పిటల్స్ లో చికిత్స పొందుతూ ఉండగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎమ్మెల్సీ యాదవ రెడ్డి సహాయసహకారాలతో ముఖ్యమంత్రి నిధుల నుండి మంజూరు అయిన రెండు లక్షల రూపాయల( ఎల్ ఓ సి) ని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమం ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని సీఎంఆర్ఎఫ్ ను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఐతే గత బీఆర్ఎస్ ప్రభుత్వనికి భిన్నంగా ఇప్పుడు ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం చాలా తక్కువ నిధులను మంజూరు చేస్తుందని అన్నారు. పేద ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని సహాయాన్ని మరింత పెంచాలని సూచించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను మేము అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పి, 'అభయహస్తం' మేనిఫెస్టోతో ప్రజలను నమ్మబలికి ఓట్లు దక్కించుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించిందని అన్నారు. ప్రజలకు బాండ్ పేపర్లు రాసిచ్చి, 100 రోజుల్లో హామీలు అమలు చేస్తామని చెప్పి ప్రజలను మోసం చేశారని అన్నారు.అన్ని వర్గాల ప్రజల చెవిలో పువ్వులు పెట్టింది కాంగ్రెస్ ప్రభుత్వం అని ఆయన అన్నారు.బడ్జెట్ లో ఎక్కడ కూడా ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడానికి ప్రయత్నం చేయలేదు అని ఆయన తెలిపారు. మాటల గారడీ తప్ప పేదల పట్ల చిత్తశుద్ధి లేదు అని తెలిపారు.ప్రపంచ ఎన్నికల చరిత్రలోనే కాంగ్రెస్ పార్టీ అభయహస్తం మేనిఫెస్టో అత్యంత పెద్ద ఫ్రాడ్ అని అన్నారు.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి దాదాపు 840 రోజులు గడిచిపోయాయని కాంగ్రెస్ పార్టీ మహిళలకు ఇస్తామన్న 2,500 ల ఊసే లేదు అని వారు తెలిపార.నిరుద్యోగులకు హామీ ఇచ్చిన రెండు లక్షల ఉద్యోగాలు ఎక్కడ? నిరుద్యోగ భృతి ఏమైంది? అంటూ ప్రశ్నించారు.

ఆటో డ్రైవర్లకు ఇస్తామని చెప్పిన రూ. 24,000లో, సంవత్సరానికి రూ. 12,000 చొప్పున రెండు సంవత్సరాలుగా బాకీ ఉందని విమర్శించారు. వృద్ధులకు ఇవ్వాల్సిన నెలకు రూ. 4,000 చొప్పున మొత్తం రూ. 54,000 బాకీ ఎక్కడ అని ప్రశ్నించారు. పేదింటి ఆడబిడ్డలకు ఇస్తామని చెప్పిన తులం బంగారం ఏమైందని అన్నారు.మీ అసమర్థ పాలనతో రాష్ట్రంలో ఆర్థిక వ్యవస్థ పతనం అయిందని అన్నారు. రాష్ట్ర ప్రజలను గాలికి వదిలేసిందని అన్నారు. మహిళలకు 18 ఏళ్ల నిండిన కోటి 58 లక్షల మందికి ఇస్తామని చెప్పిన రూ. 2,500 మహాలక్ష్మి పథకం ఏమైందని ప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 5 లక్షల దివ్యాంగులకు రూ. 6,000 పెన్షన్ హామీ అమలు చేయాలన్నారు.రైతులకు రైతు భరోసా పేరుతో రూ. 15,000 ఇస్తామని చెప్పి, ఇప్పటికే ఉన్న రైతుబంధునే అమలు చేయడంలో విఫలమయ్యారని విమర్శించారు.ఉద్యోగాల విషయంలో రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి యువతను మోసం చేసిందని పేర్కొన్నారు. వచ్చేది కేసీఆర్ నాయకత్వంలో రామ రాజ్యం మళ్ళీ రాబోతోందాని కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం తప్పదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బ్యాగారి ప్రభాకర్, ఉప సర్పంచ్ గోపాల్ రెడ్డి, మాజీ సర్పంచ్ చాడ శ్రీనివాస్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి రమేష్ గౌడ్, మాజీ కో అప్షన్ అహ్మద్, గ్రామ పార్టీ అధ్యక్షుడు నిజామోద్దీన్, రాములు గౌడ్, కిష్టారెడ్డి, నరేష్, రాములు, రాజు,సంపత్, మహిపాల్ రెడ్డి, అమర్, సింహం,కనకయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# 12 ఏళ్లుగా హెల్మెట్ అలవాటు... గ్రామానికి ఆదర్శంగా నిలిచినా రాములు



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) నంద గోకుల్ గ్రామానికి చెందిన రాములు (80) అనే వ్యక్తి గత 12 సంవత్సరాలుగా ద్విచక్ర వాహనం నడిపే ప్రతిసారి హెల్మెట్ ధరించడం ద్వారా ఆదర్శంగా నిలుస్తున్నారు. చిన్న దూరం అయినా, పెద్ద ప్రయాణం అయినా భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ ఆయన నిరంతరం హెల్మెట్ వినియోగాన్ని కొనసాగిస్తున్నారు. రోడ్డు భద్రతపై ఆయన చూపుతున్న చిత్తశుద్ధి గ్రామస్థులకు ప్రేరణగా మారింది.ఈ సందర్భంగా నిర్వహించిన "అరైవ్ అలైవ్" అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు రాములను అభినందించారు. హెల్మెట్ వినియోగంలో క్రమశిక్షణ పాటిస్తున్నందుకు శాలువాతో సన్మానించి, మెమెంటో అందజేశారు. ప్రాణరక్షణలో హెల్మెట్ కీలకమని, ప్రతి ఒక్కరూ రాములను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఇటువంటి వ్యక్తుల వలన సమాజంలో చైతన్యం పెరుగుతుందని పేర్కొన్నారు.

# అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



తార్నాక(ప్రశ్న న్యూస్)అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకొని ఉస్మానియా యూనివర్సిటీ లో అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఓయూ వీసీ ప్రొఫెసర్ కుమార్ అగ్నిమాపక సిబ్బందితో కలిసి వారోత్సవాల పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విసి కుమార్ మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన ఎంతో అవసరం అని అన్నారు.వారోత్సవాలలో భాగంగా అగ్నిమాపక సిబ్బంది సహకారంతో యూనివర్సిటీ లో మాక్ డ్రిల్ నిర్వహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా డీఎఫ్ఓ శ్రీదాస్ మాట్లాడుతూ ఈ నెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈసందర్భంగా అగ్నిప్రమాదాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు అన్నారు. వేసవిలో అగ్నిప్రమాదాలు సంభవించే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని ప్రజలు ప్రమాద నివారణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో మౌలాలి అగ్నిమాపక కేంద్రాధికారి రామకృష్ణ రెడ్డి, సికింద్రాబాద్ అగ్నిమాపక కేంద్రాధికారి, శంకర్, అగ్నిమాపక కేంద్రం మౌలాలి లీడింగ్ ఫైర్ ఫైటర్స్ గోవిందు, సాయి కిరణ్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతపై అనుపురంలో పోలీసుల చైతన్య కార్యక్రమం

## – ప్రమాదాల నివారణకు రోడ్డు భద్రతా కమిటీ ఏర్పాటు

## – వేములవాడ పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ : వీరప్రసాద్



వేములవాడ (ప్రశ్న న్యూస్) ప్రభుత్వం చేపట్టిన 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా సోమవారం అనుపురం గ్రామంలో పోలీసుల ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టౌన్ ఇన్స్పెక్టర్, ట్రాఫిక్ ఆర్.ఐ, ట్రాఫిక్ ఎస్.ఐ రాజు హాజరై గ్రామస్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు.గ్రామంలో ట్రాఫిక్ నిబంధనల అమలును పర్యవేక్షించేందుకు అధికారుల సమక్షంలో ప్రత్యేకంగా 'రోడ్డు భద్రతా కమిటీ'ను ఏర్పాటు చేశారు. ఇటీవల చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదాల ఉదాహరణలు ప్రస్తావిస్తూ, హెల్మెట్ ధరించడం, అతివేగాన్ని నియంత్రించడం వంటి ముఖ్యమైన అంశాలపై ప్రజలకు వివరించారు.అదేవిధంగా రహదారి నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ ప్రమాద రహిత గ్రామంగా మార్చేందుకు కృషి చేస్తామని గ్రామస్థులతో కలిసి అధికారులు భద్రతా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామ ప్రజా ప్రతినిధులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జాగిర్యాల్ లో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన సర్పంచ్ గడల ప్రసాద్



భీంగల్ (ప్రశ్న న్యూస్) నిజామాబాద్ జిల్లా, భీంగల్ మండలం,జాగిర్యాల్ గ్రామంలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ గడల ప్రసాద్ హాజరై ప్రారంభోత్సవం నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామ పాలకవర్గ సభ్యులు, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, మున్సిపల్ వైస్ చైర్మన్ సంటి లత -- జే జే నర్సయ్య, కన్నే సురేందర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే వివిధ గ్రామాల సర్పంచులు, రైతులు, స్థానిక ప్రజలు, యువజన సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.రైతులకు ప్రభుత్వం కల్పిస్తున్న వడ్ల కొనుగోలు సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని నాయకులు సూచించారు. ఈ కేంద్రం ద్వారా రైతులకు మద్దతు ధర లభించడం, మధ్యవర్తుల సమస్యలు తగ్గడం జరుగుతుందని వారు పేర్కొన్నారు.

# జాగ్రత్తలు పాటిస్తేనే ప్రమాదాల నివారణ సాధ్యం

## – రోడ్డు భద్రత అందరి బాధ్యత – జిల్లా రవాణా శాఖ అధికారి లక్ష్మణ్




సిరిసిల్ల (ప్రశ్న న్యూస్) రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని జిల్లా రవాణా శాఖ అధికారి వి. లక్ష్మణ్ అన్నారు. సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో నిర్వహించిన 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యక్రమంలో భాగంగా వారోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు భద్రత నియమాలను పాటించాలని సూచించారు. హెల్మెట్ ధరించడం, సీట్ బెల్ట్ పెట్టుకోవడం, వేగ నియంత్రణ పాటించడం వంటి చర్యలు తీసుకోవడం ద్వారా ప్రమాదాలను తగ్గించవచ్చన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపకూడదని హెచ్చరించారు.ప్రాణాలు అమూల్యమైనవని, ప్రమాదాల నివారణను ప్రతి ఒక్కరు తమ బాధ్యతగా భావించాలని ఆయన పేర్కొన్నారు. ప్రతి వాహనదారు జాగ్రత్తగా ఉంటే ప్రమాదాలను పూర్తిగా నివారించవచ్చని అన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా కార్యాలయానికి వచ్చిన వాహనదారులతో రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు. అలాగే భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమంలో ఏఎంవీఐ పృథ్వీరాజ్ వర్మతో పాటు రవాణా శాఖ సిబ్బంది కల్పన, రమ్య, సౌమ్య పాల్గొన్నారు.

# ఈరోజు సీజ్.. రేపే మళ్లీ స్టార్ట్

## రేషన్ బియ్యం అక్రమ రవాణా దందాలో నిర్వాహకుల బరితెగింపు

- చట్టాలంటే భయం లేదు.. పోలీసు కేసులంటే లెక్క లేదు.?
- నిర్వాహకులపై పిడి యాక్ట్ పెడితేనే మాఫియాకు చెక్ అంటున్న ప్రజలు
- రాత్రి 7 నుండి ఉదయం 6 గంటల వరకు అధికారులు దాడులు ఎందుకు మరిచారు




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) పేదల సొమ్ముతో కోట్లకు పడగలెత్తుతున్న రేషన్ బియ్యం అక్రమ రవాణా దందా రోజురోజుకీ పెరుగుతోంది. అధికారులు ఈరోజు దాడులు చేసి సీజ్ చేసిన గోదాములు, వాహనాలు మరుసటి రోజే మళ్లీ కార్యకలాపాలు ప్రారంభించడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. చట్టాలపై భయం లేకుండా, పోలీసులు పెట్టే కేసులు అంటే లెక్క చేయకుండా నిర్వాహకులు బరితెగించి వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రేషన్ బియ్యం అక్రమ రవాణా దందా ఒక బలమైన మాఫియాగా మారి అధికారులను ఆర్థిక బలంతో లొంగదీసుకుని నామమాత్రపు కేసులు పెట్టించుకుని యదేచ్ఛగా తమ కార్యకలాపాలను నిర్వహిస్తుందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### కేసులు వేసినా మారని తీరు..

ప్రస్తుతం మూడు నెలల రేషన్ బియ్యం ఇవ్వడంతో మాఫియాకు కాసులపంట పండుతోంది. ఇటీవల పలు పత్రికల్లో వరుస కథనాలు రావడంతో అధికారులు మేల్కొని దాడులు చేసి కేసులు పెడుతున్న నిర్వాహకులలో ఎలాంటి మార్పు రావడం లేదు కదా రెచ్చిపోయి మరింత ఎక్కువ చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటివరకు అనేక కేసులు నమోదు చేసినా అక్రమ రవాణా దారుల్లో ఎలాంటి మార్పు అసలు కనిపించడం లేదు. తాత్కాలికంగా అరెస్టులు, వాహనాల సీజ్‌లతో మాత్రమే చర్యలు పరిమితమవుతున్నాయి. కానీ కొద్ది రోజులకే మళ్లీ అదే దందా యదేచ్ఛగా కొనసాగుతోంది. దీంతో "పిడి యాక్ట్" వంటి కఠిన చట్టాలు అమలు చేస్తేనే ఈ దందాకు అడ్డుకట్ట పడుతుందని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

### మూడు జిల్లాల్లో మాఫియా బలంగా

రంగారెడ్డి, సిద్దిపేట, నల్లగొండ జిల్లాల్లో రేషన్ బియ్యం అక్రమ రవాణా గుట్టుచప్పుడు కాకుండా కొనసాగుతోంది. నల్లగొండ జిల్లా సూర్యాపేట నుండి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంకి భారీగా తరలి వెళ్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి తక్కువ ధరకు బియ్యం సేకరించి, ఇతర రాష్ట్రాలకు లేదా బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారు. ఇందులో స్థానిక దళారులు, గోదాం నిర్వాహకులు, ట్రాన్స్‌పోర్ట్ నెట్‌వర్క్ కీలక పాత్ర పోషిస్తున్నట్లు సమాచారం.

**పెద్ద అంబర్పేట్ కేంద్రంగా అక్రమ రవాణా**

ప్రత్యేకంగా పెద్ద అంబర్పేట్ పరిధిలో ఈ అక్రమ రవాణా విస్తృతంగా జరుగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొంతమంది అధికారులకు తెలిసిన దాడులు చేయకపోవడం మిస్సమ్మయాన్ని కలిగిస్తోంది. ఇక్కడి నుంచి భారీగా బియ్యం నిల్వ చేసి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఈ ప్రాంతంపై అధికారులు ఇంకా సమగ్ర దాడులు చేపట్టకపోవడం అనేక సందేహాలకు తావిస్తోంది.

### పేదల బియ్యం దోచుకుంటున్న దందా

ప్రభుత్వం పేదలకు అందిస్తున్న రేషన్ బియ్యం అక్రమంగా మళ్లించడం వల్ల నిజంగా అర్హులైన వారికి నష్టం జరుగుతోంది. పేదల కడుపు నింపాల్సిన బియ్యం కొంతమంది మాఫియా చేతుల్లోకి వెళ్లి కోట్ల రూపాయల వ్యాపారంగా మారుతోంది. రేషన్ డీలర్ల నుండి కనీసం సామాన్యునికి అందకుండానే బియ్యం మాఫియా చేతుల్లోకి వెళ్లడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది.?

సీలింగ్ కూడా సీలింగ్ కూడా తీయని బ్యాగులు మాఫియా గోదాములలో ఉండటం ఏమిటో అర్థం కాని పరిస్థితి. ఏకంగా ఇది సామాన్యుడి హక్కును మింగే చర్యగా ప్రజలు విమర్శిస్తున్నారు.

### అధికారులపై అనుమానాలు..

కొన్ని ప్రాంతాల్లో ఈ దందా ఇంత భారీగా కొనసాగుతుండటంతో అధికారుల పాత్రపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రేషన్ బియ్యం అక్రమ రవాణాపై కొంతమంది అధికారులకు, సిబ్బందికి సమాచారం ఉన్నప్పటికీ కఠిన చర్యలు తీసుకోకపోవడం వెనుక నెల నెల మామూళ్లు అందుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. అన్నీ తెలిసిన అధికారులు దాడులు చేయకపోవడం వెనక ఏదైనా కారణం ఉందా అన్న ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. రాత్రి 7 గంటల నుండి ఉదయం 7 గంటల వరకు సాగే ఈ రేషన్ బియ్యం అక్రమ రవాణాపై ఎందుకు నిఘా ఏర్పాటు చేయడం లేదని ఒకవేళ రాత్రిపూట విధులు నిర్వహించి అధికారులు ఎందుకు పట్టుకోవడం లేదో ఉన్నత అధికారులకే తెలియాలి.

### మాఫియా పై కఠిన చర్యలే పరిష్కారం..

రేషన్ బియ్యం అక్రమ రవాణా దందాను అరికట్టాలంటే కేవలం సీజ్‌లు, కేసులు సరిపోవని, ప్రధాన నిర్వాహకులపై పిడి యాక్ట్ వంటి కఠిన చట్టాలు అమలు చేయాలని ప్రజలు కోరుతున్నారు. అప్పుడే ఈ మాఫియా దందాకు పూర్తిగా చెక్ పడుతుందని అభిప్రాయం వ్యక్తమవుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి అక్రమ రేషన్ బియ్యం దందా నిర్వాహకుల పై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# ఈసారి వర్షాలు తక్కువే

**- నైరుతి రుతుపవనాలపై ఐఎండీ తొలి అంచనా**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) దేశవ్యాప్తంగా కోట్లాది మంది రైతులు, ప్రజలు ఎదురుచూస్తున్న 2026 నైరుతి రుతుపవనాలపై భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తన తొలి విడత అంచనాలను సోమవారం విడుదల చేసింది. ఈ ఏడాది వర్షాలు సాధారణం కంటే తక్కువగా ఉండే అవకాశం ఉందని, దీర్ఘకాలిక సగటు లో సుమారు 90 నుంచి 95 శాతం మధ్య వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని స్పష్టం చేసింది. దేశవ్యాప్తంగా సగటున 92 శాతం వర్షపాతం నమోదయ్యే సూచనలు ఉన్నాయని, ఇందులో 5 శాతం అటూఇటూగా ఉండవచ్చని పేర్కొంది. 1971 నుంచి 2020 మధ్య కాలంలోని వర్షపాత డేటా ఆధారంగా, దేశంలో దీర్ఘకాలిక సగటు వర్షపాతం 87 సెం.మీ.గా ఉంది. దీని ఆధారంగానే ఐఎండీ తన అంచనాలను వెల్లడిస్తుంది. కాగా, రుతుపవనాల కదలికలు, సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలను మరింతగా విశ్లేషించి, మే చివరి వారంలో సవరించిన అంచనాలను విడుదల చేస్తామని ఐఎండీ తెలిపింది.రుతుపవనాలపై ప్రభావం చూపే కీలక అంశాల గురించి కూడా ఐఎండీ వివరించింది. ప్రస్తుతం పసిఫిక్ మహాసముద్రంలో బలహీనంగా ఉన్న లా నినా పరిస్థితులు ముగిసి, ఎల్ నినో–సదరన్ ఆసిలేషన్ తటస్థ స్థితికి మారుతున్నాయని తెలిపింది. అయితే, 'మాన్‌సూన్ మిషన్ క్లైమేట్ ఫోర్‌కాస్ట్ సిస్టమ్' మోడల్ ప్రకారం, నైరుతి రుతుపవనాల సమయంలో ఎల్ నినో పరిస్థితులు ఏర్పడే ప్రమాదం ఉందని ఐఎండీ హెచ్చరించింది. సాధారణంగా ఎల్ నినో ఏర్పడినప్పుడు ఆసియా దేశాలలో వర్షాలు తగ్గి, కరవు పరిస్థితులు తలెత్తుతాయి. మరోవైపు హిందూ మహాసముద్రంలో ఇండియన్ ఓషన్ డైపోల్ ప్రస్తుతం తటస్థంగా ఉందని, రుతుపవనాల చివరి దశలో ఇది సానుకూలంగా మారే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేస్తోంది. పసిఫిక్, హిందూ మహాసముద్రాలలోని సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు భారత రుతుపవనాలపై బలమైన ప్రభావాన్ని చూపుతాయి కాబట్టి, ఈ రెండు సముద్రాల్లోని పరిస్థితులను నిశితంగా గమనిస్తున్నట్లు ఐఎండీ తన ప్రకటనలో స్పష్టం చేసింది.

## హర్మ్యూజ్ గుండా వెళ్లే భారత నౌకలకు టోల్ ఫీజు లేదు

**- ఇరాన్ రాయబారి మహమ్మద్ ఫతాలీ**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) హర్మ్యూజ్ జలసంధి గుండా వెళుతున్న భారతీయ చమురు ట్యాంకర్ల నుంచి తాము ఎలాంటి టోల్ ఫీజును వసూలు చేయడం లేదని ఇరాన్ స్పష్టం చేసింది. ఈ మేరకు ఇరాన్ రాయబారి మహమ్మద్ ఫతాలీ న్యూఢిల్లీలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, ఇరాన్, భారత్ మధ్య మంచి సంబంధాలు ఉన్నాయని అన్నారు. ప్రస్తుత క్లిష్ట సమయంలోనూ సానుకూల సంబంధాలు కొనసాగుతున్నట్లు తెలిపారు. భారత్‌తో ఉన్న మైత్రి కారణంగా రవాణా ఉచితంగా సాగుతోందని అన్నారు. అమెరికాతో చర్చలు పునఃప్రారంభించడానికి తాము సిద్ధంగా ఉన్నామని, కానీ తమ డిమాండ్లకు అనుకూలంగా స్పందించాలని స్పష్టం చేశారు. మా షరతులను అమెరికా అంగీకరిస్తే, మరో విడత చర్చలు సాధ్యమవుతాయని అన్నారు. ఇటీవల తాత్కాలిక యుద్ధ విరమణ అనంతరం చర్చల సందర్భంగా అమెరికా అంగీకార యోగ్యం కాని డిమాండ్లు తమ ముందు ఉంచిందని పేర్కొన్నారు. అందుకే చర్చల్లో ప్రతిష్ఠంభన ఏర్పడిందని అన్నారు. ఇరాన్ ఓడరేవులను దిగ్బంధిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన హెచ్చరికలపై మహమ్మద్ ఫతాలీ స్పందిస్తూ, ఇరాన్ సామర్థ్యం గురించి వాషింగ్టన్‌కు తెలుసని అన్నారు. పశ్చిమాసియాలో ప్రస్తుతం నెలకొన్న ఉద్రిక్తతల సమయంలో, భారత్, ఇరాన్ ద్వైపాక్షిక సంబంధాల ప్రాముఖ్యతను ఆయన నొక్కి చెప్పారు.

## అశ్రునయనాల మధ్య ఆశా భోంస్లేకు తుది వీడ్కోలు

**- ముంబైలో ముగిసిన అంత్యక్రియలు**



ముంబై (ప్రశ్న న్యూస్) భారతీయ సినీ సంగీత ప్రపంచంలో ఒక శకం ముగిసింది. దిగ్గజ గాయని, స్వర సామ్రాజ్ఞి ఆశా భోంస్లే (92) పంచభూతాల్లో లీనమయ్యారు. ముంబైలోని శివాజీ పార్క్ శ్మశానవాటికలో సోమవారం సాయంత్రం ఆమె అంత్యక్రియలు పూర్తి ప్రభుత్వ లాంఛనాలతో జరిగాయి. సూర్యాస్తమయ వేళ, అశ్రునయనాల మధ్య ఆమెకు తుది వీడ్కోలు పలికారు. కుటుంబ సభ్యులు, రాజకీయ ప్రముఖులు, అభిమానుల సమక్షంలో వేద మంత్రోచ్ఛారణలతో తుది సంస్కారాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు గాలిలో మూడు రౌండ్లు కాల్పులు జరిపి గౌరవ వందనం సమర్పించారు. అనంతరం పోలీస్ బ్యాండ్ సభ్యులు 'లాస్ట్ పోస్ట్' వాయిస్తూ ఆమెకు సైనిక లాంఛనాలతో నివాళి అర్పించారు. అంతకుముందు ఆమె నివాసం నుంచి శివాజీ పార్క్ వరకు భారీ ఊరేగింపుతో అంతిమయాత్ర సాగింది.ఆశా భోంస్లే ఏప్రిల్ 12న ముంబైలోని బ్రీచ్ క్యాండీ ఆసుపత్రిలో తుదిశ్వాస విడిచారు. గుండెపోటుతో ఆసుపత్రిలో చేరినట్లు తొలుత వార్తలు వచ్చినా, ఛాతీ ఇన్ఫెక్షన్, తీవ్రమైన అలసట కారణంగా ఆమె మరణించినట్లు మనవరాలు జానై భోంస్లే వెల్లడించారు. పదేళ్ల వయసులోనే మరాఠీ చిత్రంతో గాయనిగా ప్రస్థానం ప్రారంభించిన ఆశా భోంస్లే, ఎనిమిది దశాబ్దాలకు పైగా తన గానంతో శ్రోతలను మంత్రముగ్ధులను చేశారు. 'ఉమ్రావ్ జాన్', 'తీస్రీ మంజిల్', 'రంగీలా' వంటి చిత్రాల్లో ఆమె పాడిన ఎన్నో గీతాలు అజరామరంగా నిలిచిపోయాయి. ఇటీవల దుబాయ్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో 'తౌబా తౌబా' పాటకు ఉత్సాహంగా డ్యాన్స్ చేసిన వీడియో వైరల్ అయింది. ఆమె మరణంతో భారతీయ సంగీతంలో ఓ సువర్ణాధ్యాయం ముగిసినట్లయింది.

# ప్రభుత్వ జూనియర్ కళాశాల స్థలంలో
# అక్రమ కమర్షియల్ నిర్మాణాలు నిజమేనా.?

- వేములవాడలో ప్రభుత్వ జూనియర్ కళాశాల భూమి ఆక్రమణ ఆరోపణలు
- షటర్ల వెనుక సీక్రెట్ ఏమిటి.? అక్రమ నిర్మాణాలపై చర్యలు ఎప్పుడు.?
- అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకొని ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలి
- స్థానిక పలువురు ప్రజల డిమాండ్







వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల స్థలం ఆక్రమణకు గురైందని స్థానికుల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కళాశాలకు చెందిన భూమిలో కమర్షియల్ షటర్లు నిర్మించి గత నాలుగు దశాబ్దాలుగా అద్దెకు ఇస్తూ కొందరు లాభాలు పొందుతున్నారని ఆరోపిస్తున్నారు.వివరాల్లోకి వెళ్తే, వేములవాడలో 1980 జనవరి 10న ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రారంభమైంది. అప్పటి ప్రిన్సిపాల్ (ఎఫ్.ఏ.సి.) వై. ఆంధ్రపూర్ణాచారి (18-12-1987 నుంచి 02-03-1988 వరకు), అనంతరం ప్రిన్సిపాల్ ఆర్. పుల్లయ్య (03-03-1988 నుంచి 31-08-1988 వరకు) పదవీ కాలంలోనే కళాశాల స్థలం ఆక్రమణకు గురైందని స్థానికులు పేర్కొంటున్నారు.మొత్తం 4.20 ఎకరాల విస్తీర్ణం కలిగిన కళాశాల భూమిలో నుంచి సుమారు 20 గుంటలను ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు కేటాయించినట్లు సమాచారం. అయితే మిగిలిన కళాశాల వెనుక భాగంలో గల స్థలంలో ప్రహరీ గోడను కలుపుకొని అక్రమంగా షటర్లు నిర్మించి,వాటిని అద్దెకు ఇస్తూ ఆదాయం పొందుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.పట్టణ నడిబొడ్డున ఉన్న ఈ విలువైన ప్రభుత్వ భూమి గత 40 ఏళ్లుగా ఆక్రమణలో ఉన్నప్పటికీ, పాలకులు, సంబంధిత అధికారులు గమనించలేదా.? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.ఇప్పటికైనా అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, ఆ నిర్మాణాలు నిజంగా కళాశాలకు చెందినవేనా లేదా అక్రమమా అనే విషయంపై స్పష్టత ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు. ఒకవేళ అక్రమ నిర్మాణాలుగా తేలితే వాటిని కూల్చివేసి, భూమిని తిరిగి కళాశాలకు అప్పగించాలని పలువురు స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# మంగ్లీ వర్సెస్ అడ్వకేట్ సుబ్బారావు

## - పంజాగుట్ట పోలీసుల కీలక వివరణ



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) సింగర్ మంగ్లీపై ఫిర్యాదు చేసేందుకు లాయర్ సుబ్బారావు పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌కు వెళ్లగా హైడ్రామా చోటుచేసుకుంది. ఆల్కహాల్ తాగి వచ్చాడని అనుమానంతో సుబ్బారావుకు పంజాగుట్ట సీఐ బ్రీత్ అనలైజర్ టెస్ట్ చేయించారు. రీడింగ్ 27 పాయింట్లు రాగా, మోతాదులోపు ఆల్కహాల్ తీసుకున్నట్లు నిర్ధారణ అయింది. అయితే తాను రాత్రి మద్యం సేవిస్తే ఉదయం పీఎస్‌కు వచ్చిన తనకు బ్రీత్ అనలైజర్ టెస్ట్ చేయడం ఏంటని లాయర్ సుబ్బారావు పోలీసులను ప్రశ్నించారు. తనను అవమానించి, కేసు తప్పుదోవ పట్టించేందుకే పోలీసులు ఇలా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తానేమైనా డ్రంక్ చేసి వాహనం నడిపానా ఏంటి.. కేవలం ఫిర్యాదు చేయడానికి కామన్ మ్యాన్‌లా పీఎస్‌కు వచ్చిన తనతో పోలీసులు వ్యవహరించిన తీరు సరికాదన్నారు. తనపై మంగ్లీ చేసిన ఆరోపణలకు ఆధారం చూపించాలని డిమాండ్ చేశారు. తనపై నిరాధార ఆరోపణలను చేయడంతో ఎంతో మందిని మోసం చేసిన సింగర్ మంగ్లీపై కేసు నమోదు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని పంజాగుట్ట పోలీసులను కోరారు. బాధితులు వచ్చి ఫిర్యాదు చేస్తారు, వారి గురించి మీరు హడావుడి చేయవద్దు అని సుబ్బారావుకు పంజాగుట్ట పోలీసులు సూచించారు. అయితే బాధితుల తరఫున తాను లీడ్ చేస్తున్నానని, లాయర్ గా వారికి అన్ని రకాలుగా చట్ట ప్రకారం సహాయం చేస్తానన్నారు. తప్పు చేసిన వారు ఎవరైనా చట్ట ప్రకారం శిక్ష తప్పదని, బాధితులకు న్యాయం జరుగుతుందన్నారు.

### - పాటే నా ప్రాణం.. నన్ను రోడ్డుకు లాగకండి: సింగర్ మంగ్లీ

మైక్రో ఫైనాన్స్ పేరుతో వందల కోట్ల రూపాయల వసూళ్లకు పాల్పడ్డారంటూ తనపై వస్తున్న ఆరోపణలపై ప్రముఖ టాలీవుడ్ సింగర్ మంగ్లీ తీవ్రంగా స్పందించారు. తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ సదరు న్యాయవాదిపై ఆమె నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మీడియా ముందుకు వచ్చిన ఆమె తన ఆవేదనను వ్యక్తం చేస్తూ కన్నీటి పర్యంతమయ్యారు.

### - బెదిరింపులకు పాల్పడ్డారు

మార్చి 21న సుభా సియపోగు అనే వ్యక్తి తనను కలిశారని, లాయర్ సుబ్బారావు అనే వ్యక్తితో కలిసి తనను అమర్యాదగా బెదిరించారని మంగ్లీ ఫిర్యాదులో పేర్కొన్నారు. తనకు సంబంధం లేని కరెన్సీ నోట్ల వీడియోలు చూపించి, తనను కలవకపోతే పరువు తీస్తానని ఒత్తిడి తెచ్చారని వెల్లడించారు. ఈ పరిణామాలతో తన కుటుంబ సభ్యులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె పోలీసులను కోరారు.

### - మీడియాకు మంగ్లీ రిక్వెస్ట్..

'నాకు ఎలాంటి వ్యాపారాలు లేవు.. కేవలం పాటే నా ప్రాణం. ఎవరో వచ్చి ఆరోపణలు చేస్తే నిజనిజాలు తెలుసుకోకుండా వార్తలు రాయవద్దు' అని మంగ్లీ మీడియాను వేడుకున్నారు. కేవలం ఫేమస్ అవ్వాలనే ఉద్దేశంతోనే ఆ వ్యక్తి తనపై 150 కోట్ల మోసం అనే అబద్ధపు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. సోషల్ మీడియా ద్వారా ఎదిగిన తనకు, అదే శాపంగా మారుతుందని ఎప్పుడూ అనుకోలేదని ఆవేదన చెందారు. గతంలో తనపై రాజకీయ ముద్రలు వేయడంతో తర్వాత ఏ పార్టీకి కూడా తాను పాటలు పాడలేదని ఈ సందర్భంగా ఆమె గుర్తు చేశారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588